# పరిచయం

## శ్రోతలు

"క్రీస్తు యొక్క అపొస్తలుడైన" పౌలు ప్రియమైన స్నేహితునికి వ్రాసిన ఒక పత్రికను మనము చదవబోతున్నాము (1:1). నిజానికి, ఈ పత్రికను స్వీకరించబోవుచున్నవాడు పౌలుకు సమీప స్నేహితుడైయుంటాడు. ఆ పత్రికే తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక. "విశ్వాసమును బట్టి నా నిజమైన కుమారుడగు"వానికి (1:2) ఇది వ్రాయబడినది. ఇది ఉత్సాహపరచు మరియు దయగల భాషాప్రయోగంతో నిండియుంది.

అయినప్పటికీ, ఇది ఇతరులకు కూడా వ్రాయబడినట్లుగా సూచిస్తుంది. ఉదాహరణకు, ముగింపు ఆశీర్వచనము - "కృప మీకు తోడైయుండునుగాక" (6:21) - అనే మాటలో "మీకు" అనే బహువచనము ఉన్నది. AB అను అనువాదములో "కృప ... *మీ అందరికి* తోడైయుండునుగాక" అని ఉంది (ఉద్ఘాటన జోడించబడింది). ఇంకా చూస్తే, ఎఫెసులోని సంఘముతో ఈ పత్రికను పంచుకోవాలని కూడా తిమోతిని కోరుతున్నట్లుగా ఈ పత్రిక యొక్క విషయము మనకు చూపుతుంది. పౌలు తనను గూర్చి గుర్తించిన తీరును ఒక ఉదాహరణముగా తీసుకోవాలి: "మన రక్షకుడైన దేవునియొక్కయు మన నిరీక్షణయైన క్రీస్తుయేసుయొక్కయు ఆజ్ఞప్రకారము క్రీస్తుయేసు యొక్క అపొస్తలుడైన పౌలు" (1:1). పౌలు యొక్క అపొస్తలుని అధికారమును బట్టి తిమోతి నిర్ధారించబడనవసరం లేదు, కాని ఎఫెసులోని కొంతమంది క్రైస్తవులకు అవసరం ఉన్నట్లుగా తెలుస్తుంది. (ఎఫెసును గూర్చిన అధిక సమాచారము కొరకు, 1:3పై ఉద్ఘాటన జోడించబడింది.)

1 తిమోతి పత్రిక "పైయక్తికమైనది, కాని రహస్యముగా పంపబడినది కాదు" అని కొందరు సూచించారు.[1] పౌలు యొక్క నిర్దేశములను తిమోతి జరిగించునపుడు, ఎఫెసులోని సంఘమునకు సంబంధిత వాక్యభాగములను చదువుతూ "పౌలు నాకు చెప్పినది మాత్రమే నేను చేస్తున్నాను" అని చెప్పియుండుట ఊహించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.

## రచయిత

1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికలను రాసినది ఎవరు? లేఖనముల యొక్క ప్రేరణను అంగీకరించేవారికి (2 తిమోతి 3:16, 17), ఈ ప్రశ్న వల్ల పెద్ద సమస్య ఏమీ ఉండకపోవచ్చు. ఈ మూడు పత్రికలు కూడా అపొస్తలుడైన పౌలుకే ఆరోపించబడినవి (1:1; 2 తిమోతి 1:1; తీతుకు 1:1); మనకు, ఈ ప్రశ్న

పరిష్కరించబడినదే. ఇంకా చూస్తే, పౌలు యొక్క గ్రంథకర్తృత్వాన్ని, అది రోమాకు చెందిన క్లెమెంట్ (క్రీ.శ. 90వ దశమాంకం) నుండి ఓరిగన్ (క్రీ.శ. 210-250) వరకు ఆదిమ “సంఘ పితరులు” అంగీకరించారు.[2] J. W. Roberts వ్రాస్తూ,

> రోమాకు చెందిన క్లెమెంట్ (సుమారు క్రీ.శ. 96) మొదలుకొని ఆదిమ క్రైస్తవ రచయితలచే తరచూ ఉల్లేఖనముగా చెప్పబడిన ప్రామాణిక పరిశుద్ధగ్రంథ పుస్తకము చాలా అరుదు ... క్రొత్త నిబంధన యొక్క ఆదిమ అనువాదములన్నిటిలో కూడా ఈ పుస్తకములు కలుపుబడినవి ... ఆధునిక కాలములలో హేతువాదము రానంత వరకు కూడా పరిశుద్ధ గ్రంథములోని ఈ పుస్తకములు అధీకృత పౌలు ఉత్పత్తులలో భాగము కాదని ఏ ఒక్క పండితుడు కూడా ఎన్నడూ ప్రశ్నించలేదు.[3]

పౌలును రచయితగా తిరస్కరించువారి నుండి వచ్చే వాదనలు ఎలా ఉన్నాయి? పౌలే ఈ పత్రికలను రాసాడు అని చెప్పడానికి అంతర్గత మరియు బహిర్గత ఆధారాలు ఎన్ని ఉన్నాను, నేడు వేదాంతుల మధ్య ఆయనే రచయిత అనే విషయాన్ని తిరస్కరించడం సాధారణమైపోయింది. యౌవన వేదాంతులకు వ్రాయబడిన పుస్తకములో, Luke Timothy Johnson మాట్లాడుతూ, “సేవకుల పత్రికలు [అనగా ప్రసంగీకులకు వ్రాయబడిన మూడు పత్రికలు తిమోతికి వ్రాసిన రెండు మరియు తీతుకు పత్రికలు] వ్రాయబడినది పౌలుచే కాదు కాని పౌలు సంప్రదాయమునకు చెందిన వేరొక వ్యక్తిచే వ్రాయబడినది అనే ప్రసిద్ధమైన వేదాంత అభిప్రాయాన్ని” ప్రస్తావించాడు.[4] “కాబట్టి నా చదువరులు ఈ పత్రికలను పౌలు మరణమునకు కొన్ని సంవత్సరములు తరువాత పౌలు సంప్రదాయకులచే రచింపబడిన మారుపేరుతో ప్రకటింపబడినవిగా నేను భావిస్తున్నాను” అని ఆయన తరువాత అన్నాడు.[5]

పౌలును రచయితగా అంగీకరించకపోవడానికి ఈ “పండితులు” ఇచ్చే కారణాలు ఏవి? వారి వాదనలను చర్చించే వాటిని క్షుణ్ణంగా తెలుసుకోడానికి ఎవరైనా వేరొక స్థలములో వెదకవచ్చు,[6] కాని బాగా ప్రసిద్ధమైన వాటియొక్క సారాంశం ఈ క్రిందివిధంగా ఉంది. ఈ మూడు పత్రికలు పౌలు రచించి ఉండడు అని బలంగా వాదించేవారి చేతిలోనే వీటి ఆధారాలు చూపవలసిన బాధ్యత ఎక్కువగా ఉంది అనే విషయాన్ని మనము మనసులో ఉంచుకోవాలి.

*భాషా ఆధారిత వాదన.* పౌలుచే వ్రాయబడిన ఇతర పత్రికలతో పోల్చితే ఈ పత్రికల పదజాలము మరియు వ్యాకరణ శైలి చాలా భిన్నంగా ఉంటుంది అనేదే “అత్యంత ఆకర్షణీయమైన వాదన” అని William Barclay అన్నాడు.[7] పదజాలమును గూర్చి ఆలోచిస్తే, ఈ పత్రికలు పూర్తిగా భిన్నమైన పదాలను ఉపయోగిస్తున్నాయనియు మరియు ఇతర పత్రికలలో పౌలు ప్రయోగించిన పదాలు ఈ రచనలలో అగుపడుటలేదనియు గుర్తించబడినది.[8] ఇది వాస్తవమే, కాని నిస్సందేహంగా పౌలుచే రచించబడినవని గ్రహింపబడుతున్న పత్రికల మధ్య కూడా ఈ విధమైన పదజాల భేదాలు ఉన్నాయి. “[పదజాలములోని] ఈ విభేదాలు చాలా అతిశయింపబడ్డాయి. వాస్తవిక లెక్కింపు ప్రకారం థెస్సలోనీక సంఘమునకు వ్రాసిన పత్రికలలో ఉన్న పదజాల భేదాలతో పోల్చితే ఇవి చాలా తక్కువే” అని Roberts గుర్తించాడు.[9] శైలి విషయముకొస్తే, తిమోతి మరియు తీతుకు వ్రాసిన మొత్తము ఈ మూడు పత్రికలలోని

శైలియు మరియు రోమీయులకు, ఎఫెసీయులకు మరియు ఇతర పౌలు పత్రికలలో ఉండే శైలికి కొంత భిన్నమైన శైలిని కలిగియున్నాయని సూచించబడింది.

పదజాలము మరియు శైలిలో గల ఈ భేదములకు అనేక వివరణలు ఇవ్వవచ్చును:

శ్రోతలలో వ్యత్యాసము. ఫిలేమోనుకు వ్రాసినప్పుడు ఇచ్చిన గమనిక మినహా, పౌలు వ్రాసిన ఇతర పత్రికలన్నియు కూడా సంఘముల వారికి వ్రాయబడినవి, కాగా ఈ మూడు మాత్రము వ్యక్తులకు వ్రాయబడినవి. సాధారణంగా, వీటికి మరింత వ్యక్తిగత పరిభాష ఉండవచ్చు.

విధానములోని వ్యత్యాసము. సంఘముల వారికి వ్రాసిన పత్రికలవలే కాకుండా, కొన్ని ప్రత్యేకమైన సమస్యలను ఎలా పరిష్కరించాలనే విషయముపై ఈ పత్రికలు పత్యేకమైన వ్యక్తులకు వ్రాయబడినవి.

విషయములో వ్యత్యాసము. ఇతర పత్రికలలో లేనటువంటి ఆరాధన, నాయకత్వము, విధవలు, మరియు మున్నగు విషయములను గూర్చి పౌలు చాలా వివరణాత్మకంగా ఈ పత్రికలలో చర్చించాడు.

కాలములో వ్యత్యాసము. పౌలు ఇకను ఎంతమాత్రము కూడా మండుచున్న యౌవన సువార్తీకుడు కాదు. ఆయన "వృద్ధుడైన పౌలు," మరియు దేవుని వాక్యము మరియు దేవుని సంఘమును గూర్చిన భవిష్యత్ విషయమై మిగుల ఆలోచనగల వానిగా ఉన్నాడు.[11]

మతమును గూర్చి నేను వ్యాఖ్యానాలు, ప్రసంగ పుస్తకాలు, చరిత్ర (ప్రేషితోద్యమమును గూర్చి) మరియు బైబిలుపై బోధను గూర్చిన పుస్తకములు (ప్రత్యేకముగా దృశ్యసాధనముల అంశాలపై) వ్రాసాను. ఈ పుస్తకములు విషయములో, విధానములో, విద్యవిషయములో, పదజాలము మరియు మున్నగు వాటిలో వ్యత్యాసమైనవిగా ఉంటాయి. పౌలు యొక్క గ్రంథకతృత్వాన్ని విస్మరించడానికి ఉపయోగించే ఆ "పండిత" విధానాన్ని నా రచనలకు కూడా ప్రయోగిస్తే, వ్యాఖ్యానాలు వ్రాసిన David Roper అను వ్యక్తి ప్రసంగా పుస్తకములను వ్రాయలేదనియు అలాగే చరిత్ర పుస్తకమును వ్రాసిన David Roper బోధపైగల పుస్తకములను వ్రాయలేదనియు "నిరూపిత"మౌతుంది.

నిజానికి, ఈ మూడు పత్రికలలోని పదజాలము మరియు శైలి భేదముల నుండి వచ్చే ఆధారాలు పౌలు యొక్క గ్రంథకతృత్వమునకు వ్యతిరేకంగా ఒక నిర్దిష్టమైన వ్యాఖ్య చేయడానికి సరిపడవు. NASB అనువాదము గల నా ప్రతిలో, ఈ మూడు పత్రికలు కేవలము తొమ్మిది పేజీలు మాత్రమే తీసుకున్నాయి మరియు అనేక వందల వేరువేరు ఆంగ్ల పదాలను వాడుతున్నాయి. పౌలు దినములో సగటు పరిభాషలోని పదముల సంఖ్యను మనము తెలుసుకొనలేము, కాని నేడు ఒక విద్యావంతునికి సుమారు 20,000 నుండి 35,000 వరకు పదజాలము తన పదకోశములో ఉంటుంది అని అంచనా.[12] పౌలు చాలా ఎక్కువ చదివిన విద్యావంతుడు; తనకు నిస్సందేహంగా అనేక పదాలు వాడుక కొరకు ఉండి ఉండవచ్చు.ఒక పత్రికలో ఆయన కొన్ని

పదములను ప్రయోగించి వేరొక పత్రికలో భిన్నమైన పదాలను వాడాడు అనేది ఈ రెండు పత్రికలకు ఆయన రచయిత కాదు అనడానికి ఋజువు అవదు. "ప్రతియొక్క పత్రికలో పౌలు మాట్లాడుతున్న సదరు అంశములలోని (ఆత్మ ప్రేరేపితమైన) ఆలోచనలను వ్యక్తపరచడానికి (ఆత్మ ప్రేరేపితమైన) మాటలను వాడేవాడు" అని William Hendriksen వ్రాసినప్పుడు అది సరిగానే భావించి వ్రాసాడు.[13]

*చారిత్రిక వాదన:* "సేవకులకు వ్రాసిన పత్రికలలో సుస్పష్టమౌతున్న కష్టము ఏదనగా అపొస్తలుల కార్యముల పుస్తకము ద్వారా మనకు తెలిసినంత వరకు పౌలు జీవితములో స్థానములేని కొన్ని కార్యకలాపాలలో ఆయన పాల్గొనినట్లుగా ఇవి చెప్తుండడం" అని Barclay చెప్పాడు.[14]

ఈ వాదన చాలా ఆలోచనలకు తావునిస్తుంది. మొదటిగా, పౌలు యొక్క సమస్త ప్రయాణాలు మరియు కార్యకలాపాలు అపొస్తలుల కార్యములు పుస్తకములో నమోదుచేయబడినవి అని ఇది ఊహిస్తునట్లుగా ఉంది, కాని వాస్తవానికి అలా జరగలేదు. ఉదాహరణకు, 2 కొరింథీయులకు 11:25లో ప్రస్తావించబడినట్లుగా ఎప్పుడు ఆయన మూడు సార్లు ఓడపగిలిన సందర్భములలో చిక్కుకొనియున్నాడు?[15]

రెండవదిగా, అపొస్తలుల కార్యములు పుస్తకము తరువాత వెంటనే పౌలు అపరాధిగా తీర్పుతీర్చబడి వెంటనే ఉరితీయబడ్డాడు అని ఈ వాదన భావిస్తుంది, కాని ఇది ఒక చారిత్రక ఆధారము లేని వాదన. బదులుగా, అపొస్తలుల కార్యములు పుస్తకములోని ఆయన బంధకములో ఆయన వ్రాసినట్లుగా భావిస్తున్న ఆయన పత్రికలలో విడిపింపబడునట్లు ఆయన పెట్టుకొన్న నిరీక్షణకు (అపొ. 28:30; ఫిలిప్పీ. 1:25; 2:24; ఫిలే. 22) మరియు 2 తిమోతిలోని బంధకము వలన కలుగబోయే మరణ దండనకును (2 తిమోతి 2:9; 4:6-8) మధ్య చాలా వాడియైన వ్యత్యాసము కనబడుతుంది. ఈ వ్యత్యాసమునకు ఒక సులువైన వివరణ ఏమనగా పౌలు తన మొదటి బంధకము నుండి విడిపింపబడి రోమాలో తన రెండవ బంధకమునకు ముందు చాలా ఎక్కువగా ప్రయాణాలు చేసాడు అని ఆదిమ సంఘములో ఉండిన బలమైన వాదన యొక్క సత్యము (ఈ సమయములోనే ఆయన తిమోతికి రెండవ పత్రిక వ్రాసాడు).[16] "రెండవ రోమా బంధకము అనే సిద్ధాంతము చాలా బలమైన ఆధారముగలదిగా ఉంది ... ఒకవేళ ఇది నిజముగా చోటుచేసుకొని ఉంటే, పౌలు జీవన ప్రగతిలో సేవకుల పత్రికల యొక్క స్థానముపై ఉన్నట్లుగా కనిపిస్తున్న ఆ కష్టాలు వెంటనే మటుమాయం అయిపోతాయి" అని J. N. D. Kelly వ్రాసాడు.[17]

*వేదాంతపరమైన వాదన.* రోమా పత్రిక వలే 1 మరియు 2 తిమోతి అలాగే తీతుకు పత్రికలు వేదాంతపరమైన పరిశీలనాత్మక గ్రంథాలు కాదు గనుక, పౌలు వాటిని వ్రాసి ఉండకపోవచ్చుననేదే ఈ వాదన యొక్క మూల భావం. ప్రస్తుతము మనము అధ్యయనం చేస్తున్న ఈ పత్రికలు పౌలు మూలమైన సైద్ధాంతిక అంశాలు పెంపొందించిన కొన్ని పత్రికలతో పోల్చితే ఈ పత్రికలు వేరే కాలములో మరియు భిన్నమైన ప్రణాళికతో వ్రాయబడినవి అనే విషయాన్ని ఈ వాదన త్రోసిపుచ్చుతుంది. అయినప్పటికీ, ఈ పత్రికలు సైద్ధాంతిక వ్యాసాలు కాకపోయినప్పటికీ, అవి పౌలు యొక్క మూలమైన వేదాంత అంశాలను నిర్లక్ష్యము చేయుటలేదు. 1 తిమోతి 3:16 మరియు 2 తిమోతి 2:11-13లో ఉన్న మూల క్రైస్తవ అంశాల భాషతో పోల్చితే మరింత

శ్రేష్ఠమైన పరిభాషను కనుక్కోవడం కష్టమే. పౌలుకు ప్రసిద్ధమైన ఇతర అంశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

రక్షణ కృప చేతనే (1:14; 2 తిమోతి 1:9; తీతుకు 3:5).
పాపులను రక్షించుటకు క్రీస్తు ఈ లోకమునకు వచ్చెను (1:15).
మనము ఆయనయందు విశ్వసించవలసి యుంది (2 తిమోతి 1:12).
క్రీస్తు మనకు మధ్యవర్తి (2:5).
మనము చేయు సమస్తము దేవుని మహిమార్థమై చేయాలి (6:16; 2 తిమోతి 4:18).

మరొక ప్రశ్నను ఇక్కడ మనము పరిగణించాలి: 1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికల విషయములో పౌలు యొక్క గ్రంథకర్తృత్వాన్ని నిరాకరిస్తున్న వారిని గూర్చి, ఈ పత్రికల ఉద్భవము విషయమును గూర్చి వారి సిద్ధాంతము ఏమిటి? వేరొకరు ఈ పుస్తకాలను వ్రాసారు అని వారు అనుమానిస్తున్నారు (అనగా మారుపేరు గల గ్రంథకర్తృత్వము, బహుశ రెండవ శతాబ్దములో) మరియు ఈ పత్రికలకు మరింత అధికారమును అందించునట్లుగా పౌలు యొక్క పేరును ఈ పత్రికకు కేవలము కలిపారు మాత్రమే అని వారి వాదన. ఈ అపొస్తలుని యొక్క రచనల నుండి చాలా కాలము క్రింద మరుగైపోయిన కొన్ని వ్యక్తిగత విషయాలను ఈ ప్రతులకు శుద్ధతనిచ్చుటకు వీటిలో కలిపాడు అని కొందరు సూచించారు. ఇతర బలహీనతలు చూస్తే, ఆదిమ సంఘము ఏయే పుస్తకాలు బైబిలులో చేర్చాలో అనే విషయములో వారు పాటించిన ప్రధాన అంశాలను ఈ సిద్ధాంతము పరిగణనలోనికి తీసుకోవడంలో విఫలమైంది: అదే ప్రశింపబడనొల్లని అధీకృతతత్వము. రెండవ శతాబ్దమునకు ప్రత్యేకమైనవిగా భావింపబడుతున్న అంశాలను ఎత్తిచూపుటకు ఇది ప్రయత్నించింది - కానీ దీనిలో కూడా విఫలమైంది. John R. W. Stott వ్రాస్తూ ఈ క్రింది విధంగా అన్నాడు,

> మారుపేరుతో ఉన్న ఈ గ్రంథకర్తృత్వాన్ని గూర్చిన ఈ వాదన సంతృప్తికరంగా లేదు. మంచిగా ఆలోచన చేయబడి, లేదా అగుపడునట్లుగా అమాయకంగా ప్రవర్తించునట్లు కనిపిస్తున్న ఒక మిధ్యగల ప్రాచీన శిలాశాసనాల అధ్యయనము ఇవి అనే విశ్వాసం ఆమోదించుటకు సాక్ష్యాధారములు లేవు. యిచ్చాపూర్వకమైన మోసమును చేయడం అనే ప్రయోగమును గూర్చి కూడా ఇది తీవ్రమైన నైతిక ప్రశ్నలను లేవనెత్తుతుంది.[18]

అనేక ఇతర పండితులతో కలిసి, Scott ఈ ముగింపు మాటకు వచ్చాడు:

> సేవకుల పత్రికల విషయములో పౌలు యొక్క గ్రంథకర్తృత్వము ఇంకను నిలిచే ఉంటుంది. అంతర్గత మాటలు మరియు బహిర్గత సాక్ష్యా(లు) అన్నీ బలంగా, గణనీయంగా మరియు మొండిగానే ఉన్నాయి ...
>
> పౌలు యొక్క గ్రంథకర్తృత్వానికి వ్యతిరేకముగా ఉన్న వాదనలు అన్నీ కూడా నీళ్ళు చొరవనివిగా ఏమీ లేవు. తేబడిన వాదనలు ... అన్నీ కూడా

ఉత్తరమీయబడవచ్చు. పౌలుయొక్క గ్రంథక తృత్వమును త్రోసిపుచ్చేంతగా అవి చాలినవి కావు.[19]

## నేపథ్యము మరియు తారీఖు

మనము పత్రికను చదువుతుండగా, అగత్యము అనే ఒక అంతఃప్రవాహాన్ని చూస్తాము. కొంతమంది తన "నాలుగవ సువార్త ప్రయాణము"గా పరిగణిస్తున్న ఒక యాత్రలో పౌలు ఉన్నాడు. తన మూడవ సువార్త ప్రయాణము ముగింపులో, యెరూషలేములో ఆయన బంధింపబడ్డాడు. పాలస్తీనా నుండి, ఆయన గొలుసులతో రోమా పట్టణమునకు పంపబడ్డాడు. రోమాలో బంధీగా ఉన్నప్పుడు,[20] ఆయన "బంధీ పత్రికలను" వ్రాసాడు (చూడండి ఎఫెసీసీ 6:20; ఫిలిప్పీ. 1:13; కొలస్సీ. 4:18; ఫిలే. 1). ఆయన విడిపింపబడునట్లు ఎదురు చూస్తున్నాడని ఈ పత్రికలూ సూచిస్తున్నాయి (ఫిలిప్పీ. 1:25-27; 2:24; ఫిలే. 22). సుస్పష్టంగా, అది జరిగింది. పిమ్మట పౌలు తిరిగి మరియొకసారి రోమాలో బంధింపబడి చంపబడునంత వరకు ఎక్కువగా ప్రయాణము చేసాడు.

1 తిమోతి మరియు తీతుకు పత్రికలకు నేపథ్యము ఈ "నాలుగవ సువార్త ప్రయాణము"గా చెప్పబడుతున్న సన్నివేశము, కాగా 2 తిమోతి యొక్క నేపథ్యము రోమాలో పౌలు యొక్క రెండవ దిగ్భంధం - తన మరణమునకు కొంత ముందు. ఈ సమయములో పౌలు యొక్క యాత్రాసరళిని ఏవిధమైన ఖచ్చితత్వముతోనూ మనము పునఃనిర్మించలేము, కాని ఈ మూడు పత్రికలు అనేకమైన ప్రాంతాలను ప్రస్తావిస్తున్నాయి: ఎఫేసు, మాసిదొనియా, క్రేతు ద్వీపం, నికొపోలి, మిలేతు, త్రోయ, మరియు కొరింథీ (1:3; 2 తిమోతి 4:13, 20; తీతుకు 1:5; 3:12). ఈ కాలములో పౌలు స్పెయిన్ దేశమునకు కూడా వెళ్లి ఉంటాడు (చూడండి రోమా. 15:24, 28).

క్రీ.శ. 62 ముగింపులో లేదా క్రీ.శ. 63 ఆరంభంలో లూకా అపొస్తలుల కార్యములు వ్రాయడం ముగించిన తరువాత పౌలు చెరసాల నుండి బహుశ విడిపింపబడి ఉంటాడు.[21] ఆ తరువాత, సంఘ చరిత్రకారుడైన యూసిబియస్ ప్రకారం, సుమారు క్రీ.శ. 67లో ఆయన చంపబడి ఉంటాడు.[22] ఈ విషయము తిమోతికి మరియు తీతుకు పౌలు వ్రాసిన ఈ పత్రికల తారీఖును ఆ సంవత్సరాల మధ్యలో పెడుతుంది. 1 తిమోతి మరియు తీతుకు పత్రికల అంచనా తారీఖు క్రీ.శ. 63 లేదా 64, కాగా 2 తిమోతి క్రీ.శ. 67లో అపొస్తలుడు మరణించుటకు కొంచెము ముందు వ్రాయబడి ఉంటుంది.

పౌలు యొక్క పత్రికలన్నిటిలో కూడా అగత్యము అనే భావము తప్పక లక్షణముగా ఉంటుంది. ఆయన నడిపింపబడిన వ్యక్తి - ఆయనను ప్రేమించి ఆయన రక్షించిన వానియందు ప్రగాఢమైన కృతజ్ఞతా భావముతో ముందుకు నడిపింపబడిన వ్యక్తి ఆయన (1:12-17), అలాగే ఆయన నశించినంతగానే నశిస్తున్న ఇతరుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధగల వాడు కూడా (రోమా. 9:1-3). పౌలు యొక్క అంతిమ పత్రికలలో, ఈ అగత్యము అనేది మరింత తీవ్రతరము చేయబడింది. తన మర్త్యత్వమును గూర్చి ఆయనకు తెలిసే ఉన్నది. రోమాలో తన మొదటి బంధింపబడిన చెర నుండి విడిపింపబడుటకు కొంచెము ముందు, తననుతానూ "వృద్ధుడైన పౌలు"గా

గుర్తించుకున్నాడు" (ఫిలే. 9).[23] ఆయనకున్న "సంఘములన్నిటియు గూర్చిన చింత" (2 కొరింథీ. 11:28) నిస్సందేహంగా మరింత తీవ్రమైంది. ఆయన మరియు ఇతర అపొస్తలులు మరణించిన తరువాత సంఘమునకు ఏమి సంభవింపబోతుంది? తిమోతి మరియు తీతుకు ఆయన వ్రాసినప్పుడు, ఆనాటి ప్రస్తుత సవాళ్లను గూర్చి మాత్రమే ఆయన వ్రాయడం లేదుగాని, ఆయన వెడలిపోయిన తరువాత ప్రసంగీకులు ఆ పనిని కొనసాగించునట్లు కూడా వారిని సిద్ధపరుస్తున్నాడు.

## ఉద్దేశము

రోమీయులకు 15:20 ప్రకారం "వేరొకని పునాదిమీద కట్టుట" పౌలుకు ఇష్టము లేదు. ఆయన సంఘము-నిర్మించువాని కంటే కూడా సంఘము-ప్రారంభించు వాడు. కాగా, ఆయన సంఘాలను ప్రారంభించి ఆ తరువాత ఈ అనుభవంలేని సమూహాలను కనీస శ్రద్ధ లేకుండా వదిలేశాడు అని కాదు (చూడండి 2 కొరింథీ. 11:28). ఆయన నిత్యము వారిని గూర్చి ప్రార్థించాడు (ఫిలిప్పీ. 1:3, 4; 1 థెస్స. 1:2). వారికి పత్రికలను వ్రాసాడు (1 మరియు 2 కొరింథీయులకు, గలతీయులకు, ఎఫెసీయులకు వంటివి). వారిని సందర్శించాడు (అపొ. 14:21-23; 15:36, 41). తన ప్రతినిధులను వారి యొద్దకు పంపాడు - తిమోతి మరియు తీతుకు వంటివారిని (ఫిలిప్పీ. 2:19; 2 కొరింథీ. 12:18).

సదరు సంఘము బలంగా మరియు ఆరోగ్యంగా నిలిచియుండునట్లు చూచుకోవడం అనేది ఎప్పటికినీ సంపూర్ణం కాని విషయం. ఒకరు ఒక సంఘమును స్థాపించి, దానికి పెద్దలు మరియు బోధకులు ఉండునంత వరకు ఉండి, ఆ తరువాత అది ఎప్పటికీ బలముగలదిగా మరియు విశ్వాసముగలదిగా ఉంటుంది అని అనుకోలేరు. ఈ విషయాన్ని చక్కగా ఉదహరించడానికి ఎఫెసులోని సంఘమే ఉపయోగపడుతుంది. సుమారు మూడు సంవత్సరముల వరకు పౌలు అక్కడ ప్రయాసపడ్డాడు (అపొ. 20:31). ఆ తరువాత పెద్దలకు ప్రత్యేకమైన పనిని అప్పగించాడు (అపొ. 20:17-35). రోమాలో బందీగా ఉన్నప్పుడు, వారికి (ఎఫెసీయులకు) ఒక పత్రికను కూడా వ్రాసాడు. ఇదంతయు కూడా తన పని పూర్తి అయింది అని చెప్పడం లేదు. పౌలు విడిపింపబడినప్పుడు, ఆయన వెళ్ళిన స్థలములలో ఒకటి ఈ ఎఫెసు. తరువాత, మాసిదోనియాకు కూడా వెళ్లాలి అని అతను నమ్మినప్పుడు, తిమోతిని అక్కడే ఉండునట్లు ఆజ్ఞాపించి అక్కడ ఉన్న సంఘముతో కలిసి పనిచేసాడు (1:3).

### సేవకులుగా తిమోతి మరియు తీతులకు నిర్దేశించడానికి వ్రాయబడిందా?

మనము చర్చించవలసిన ఒక విషయమేమంటే 1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికలకు గుర్తింపుగా ప్రయోగింపబడే వాక్యము: "కాపరి పత్రికలు." ఈ మూడు పత్రికలను ఒకే గుంపులో చేర్చి చెప్పబడే ఈ భావము, పద్దెనిమిదవ శతాబ్దములో మొదలైంది. క్రీ.శ. 1703లో, D. N. Berdot ఈ బిరుదును వాడాడు, తరువాత 1726లో Paul Anton ఇచ్చిన ఉపన్యాసముల పరంపర ద్వారా ఇది మరింత

ప్రసిద్ధమైంది.[24] తిమోతి మరియు తీతు అనువారు సంఘముల "సేవకులు" (కాపరులు) అని పరిగణింపబడిన కారణాన వీరు మరియు తరువాతి రచయితలు ఈ పదమును ప్రయోగించారు.

అయినప్పటికీ, తిమోతి మరియు తీతు అనువారు స్థానిక సంఘములకు "కాపరులు" కారు. "పాస్టర్" అనే మాట లాటిన్ భాషలో "కాపరి" అను మాటకు సమానమైనది.[25] "పాస్టర్"/"కాపరి"గా అనువదింపబడిన గ్రీకు పదమునకు క్రియారూపము పెద్దల/పైవిచారణచేయువారిగా తమ కర్తవ్యమును నెరవేర్చిన వారిని ఉద్దేశించి క్రొత్తనిబంధనలో ప్రయోగించబడింది (అపొ. 20:17, 28; 1 పేతురు 5:1, 2). "పాస్టర్" అనేది పెద్ద/పైవాడు అను మాటకు ఒక బిరుదుగా ఉంది; ప్రసంగీకునికి లేదా సువార్తీకునికి ఇది లేఖనమిస్తున్న బిరుదు అయితే కాదు.

తిమోతికి అప్పగింపబడిన అనేక బాధ్యతలలో ఎక్కువగా కాపరి-సంబంధిత పనులే అని ఒకరు అభ్యంతరం వ్యక్తపరచవచ్చు - అంటే "మేపుట," భద్రపరచుట, మరియు ఎఫెసులోని "మంద"ను కాయుట అను పనులు. ఇది నిజమే, కాని తమ తోటి క్రైస్తవులకు సహాయము చేసి వారిని బలపరచడం అనేవి క్రైస్తవుల *అందరి* పనియై ఉంది;[26] ఇంతమాత్రమున వారు స్థానిక సంఘములకు "కాపరులు/పాస్టర్లు" అవరుగదా. అయినప్పటికీ కూడా, కాపరి వంటి పనులను తిమోతి చేయుట ద్వారా మాత్రానే ఆయన కాపరి కాజాలడు. *ఆయన ఒక సువార్తీకుడు, మరియు సువార్తీకుని యొక్క ప్రధానమైన పని "వాక్యమును ప్రకటించడం"* (2 తిమోతి 4:2, 5).

తిమోతి మరియు తీతు అనువారు కాపరులు కారు అయినప్పటికీ ఈ పత్రికలలో కాపరులకు (పెద్దలు/పైవిచారణచేయువారు) ఉండవలసిన అర్హతలు ఉన్నాయి గనుక (3:1-7; తీతుకు 1:5-9) "కాపరి పత్రికలు" అనే ఈ బిరుదు వీటికి సరియైనదే అని వారు అంటారు. అయినప్పటికీ, కాపరులను/పెద్దలను/పైవిచారణచేయువారిని గూర్చి మాట్లాడే వచనములు ఈ పత్రికలలో ఉన్న విషయములో కేవలము పది శాతము మాత్రమే ఉన్నాయి.[27] కావున ఈ పత్రికలను "కాపరి" పత్రికలుగా పరిగణించడానికి ఇది చాలా తక్కువైన కారణముగా కనిపిస్తుంది.

తిమోతి మరియు తీతుకు అనువారు కాపరులు కారు అని మరి కొంతమంది ఇంకా అర్థం చేసుకుంటున్నారు, కాని, ఈ పత్రికలకు "కాపరి పత్రికలు" అనే బిరుదు చాలా సర్వసాధారణమైపోయింది గనుక, వారు ఆ భావాన్ని వెసులుబాటుకోసమే వాడుతారు. ఈ మూడు పత్రికలను గుర్తించడానికే ఒక వాక్యము అవసరము అనుకుంటే, వీటిని "సువార్తీకుల పత్రికలు" అని పరిగణించడం మంచిది. బహుశ వాటిని కేవలం "తిమోతి మరియు తీతుకు పౌలు వ్రాసిన పత్రిక"లు గా మాత్రమే పరిగణించడం మరింత మంచిది.

## సంఘములో వారంతట వారు ఎలా వ్యవహరించుకోవాలో తిమోతి మరియు తీతులకు చూపుటకు వ్రాయబడినవా?

యౌవన ప్రసంగీకులకు "కాపరుల" నిర్దేశాలు ఇచ్చుటకు పౌలు ఈ పత్రికలను వ్రాయకుంటే, మరి ఎందుకు వ్రాసినట్లు? ప్రస్తుతానికి, "తిమోతి వ్రాసిన మొదటి

పత్రిక"గా మనము పిలుస్తున్న ఆ పత్రికకు మాత్రమే మన చర్చను పరిమితం చేద్దాం. ఆ పుస్తకమునకు మధ్యలో పౌలు తన ఉద్దేశాన్ని ఇచ్చాడు:

> శీఘ్రముగా నీయొద్దకు వత్తునని నిరీక్షించుచున్నాను; అయినను నేను ఆలస్యముచేసినయెడల *దేవుని మందిరములో, అనగా జీవముగల దేవుని సంఘములో, జనులేలాగు ప్రవర్తింపవలెనో* అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను. ఆ సంఘములు సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్నది (3:14, 15; ఉద్ఘాటన జోడించబడింది).

ఈ పత్రికలో అనేకమైన వేదాంతపర వాక్యభాగాలు ఉన్నాయి (చూడండి 3:16), కానీ 1 తిమోతి అనేది ప్రధానంగా వేదాంతప్రధానమైన పుస్తకమే కాదు. కానీ, సంఘములో మనము ఎలా వ్యవహరించాలో చెప్పుటకు ఇది ఒక ప్రయోగాత్మకమైన పుస్తకము. ఈ విషయము వలననే కొందరు ఈ పత్రికను అసలు పట్టించుకోరు. రోమీయులకు మరియు ఎఫెసీయులకు వంటి పత్రికలలో ఉన్నట్లుగా సైద్ధాంతిక వాదనలను వారు ఎక్కువగా చూస్తారు. తన పత్రికలలో అనేకమైన వాటిలో వేదాంతపరమైన అంశాలపై పౌలు చేసిన ప్రేరేపితమైన హేతువాదములను బట్టి మనము ఆయనకు కృతజ్ఞులముగా ఉన్నాము - కానీ మనకు ప్రయోగాత్మకమైన నిర్దేశములు కూడా అవసరమే. సంఘములోని విషయాలను నిర్వహించు విషయమును గూర్చి, మన దైనందిన జీవితములకు అన్వయించునట్టి ప్రేరేపితమైన నిర్దేశము మనకు అవసరము.

## విషయముల అవలోకనము

సంఘములో ఒకరు ఎలా వ్యవహరించాలి అనే విషయముపై పౌలు చేసిన నిర్దేశములను 1 తిమోతి 4:16 ఆధారంగా రెండు భాగాలుగా తీసుకోవచ్చు: "నిన్ను గూర్చియు నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగియుండుము, వీటిలో నిలుకడగా ఉండుము; నీవీలాగుచేసి *నిన్నును నీ బోధ వినువారిని* రక్షించుకొందువు" (ఉద్ఘాటన జోడించబడింది). "నిన్నును" (తిమోతి) మరియు "నీ బోధ వినువారిని" (ఎఫెసు సంఘములోని సభ్యులు) అనే ఈ పదములను బట్టే ఈ రెండు భాగములను గుర్తించవచ్చు. తిమోతికి పౌలు ఇచిన నిర్దేశములను "వ్యక్తిగత"మైనవిగా (తన సహచారునికి ఆయన ఇచ్చిన వ్యక్తిగత నిర్దేశకాలు) మరియు "ప్రయోగాత్మక"మైనవిగా (సంఘము అంతటిని గూర్చి ఇచ్చిన ప్రయోగాత్మక అంశాలు) మనము విభజించవచ్చు.

1 తిమోతి 4:12లో ఒక వ్యక్తిగత నిర్దేశము ఇవ్వబడింది: "నీ యౌవనమునుబట్టి ఎవడును నిన్ను తృణీకరింపనియ్యకుము గాని, మాటలోనూ, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండుము." సంఘమంతటికి సంబంధించిన ప్రయోగాత్మక అంశముల ఉదాహరణ ఒకదానిని 1 తిమోతి 5:16లో చూడవచ్చు: "విశ్వాసురాలైన యే స్త్రీ యింటనైనను విధవరాండ్రుండినయెడల, సంఘము నిజాముగా అనాథలైన విధవరాండ్రకు

సహాయము చేయుటకై దానిమీద భారములేకుండా ఆమెయే వీరికి సహాయము చేయవలెను."

ఒక విధముగా చూస్తే, 1 తిమోతి పత్రిక ఆద్యంతం వ్యక్తిగతమే ఎందుకంటే తిమోతి ఏమి చేయవలసియున్నాడో ఆయనకు తెలుపుతూ ఇది వ్రాయబడినట్లు ఉంది. ఇంకా చూస్తే, తిమోతికి ఇవ్వబడిన వ్యక్తిగత హెచ్చరికలకును మరియు సంఘమంతంతటికి అన్వయించునట్టి నిర్దేశములకును కొంత సరిపోలిక ఉన్నట్లుగా ఉంది. ఉదాహరణకు, పెద్దలను గూర్చిన వాక్యభాగములో (5:17-25) ఒక వ్యక్తిగత విషయము కూడా చెప్పాడు (5:23). మరలా, ధనము మరియు ఐశ్వర్యముపై ఇచ్చిన బోధలో (6:6-10, 17-19) కూడా వ్యక్తిగత విషయము కలుగజేసుకొంది (6:11-16). ఇదియుగాక, మన అధ్యయనములో విషయములను "వ్యక్తిగత"మైనవిగాను మరియు "ప్రయోగాత్మక"మైనవిగాను పరిగణించడం మనకు కొంత విలువనే తెస్తుంది.

## సంక్షిప్త వర్ణన

1 తిమోతి పత్రిక అంతటిని ఒకే దృష్టితో చూస్తే మనకు కొంత లాభం చేకూరుతుంది. ఇక్కడ ఇవ్వబడిన సంక్షిప్త వర్ణనలో, విషయములను "వ్యక్తిగతమైనవి"గా మరియు "ప్రయోగాత్మకమైనవి"గా విభజించడం జరిగింది. ప్రయోగాత్మక భాగాలు (అనగా సంఘమంతటిని ప్రభావితము చేయునట్టి అంశాలు) వంచి వ్రాసిన లిపిలో (వీటినే ఆంగ్లలో ఇటాలిక్స్ అంటారు) కనబడతాయి. ఈ విషయములు ఒకదానితోనొకటి సరిపోలినవిగా ఉంటాయి అని గుర్తుంచుకోవడం చాలా ప్రాముఖ్యం.

I. అధ్యాయము 1
- A. శుభవచనము (1:1, 2)
- B. *అబద్ధ బోధ* (1) (1:3-11)
- C. వ్యక్తిగతము (1:12-20)
  1. "పాపులను రక్షించుటకు ... క్రీస్తుయేసు వచ్చెను" (1:12-17)
  2. "మంచి పోరాటమును పోరాడుము" (1:18-20)

II. అధ్యాయము 2
- A. *బహిరంగ ఆరాధన* (2:1-15)
  1. *పురుషులు* (2:1-8)
  2. *స్త్రీలు* (2:9-15)

III. అధ్యాయము 3
- A. *పెద్దలు* (1) (3:1-7) *మరియు పరిచారకులు* (3:8-13)
- B. వ్యక్తిగతము ("నేను ఆలస్యముచేసినయెడల") (3:14-16)

IV. అధ్యాయము 4
    A. *అబద్ధ బోధ* (2) (4:1-5)
    B. వ్యక్తిగతము ("నిన్ను నీవు సాధకము చేసుకొనుము") (4:6-16)

V. అధ్యాయము 5
    A. వ్యక్తిగతము (వివిధమైన వయసుల వారిని గూర్చి) (5:1, 2)
    B. *విధవరాండ్రు* (5:3-16)
    C. *పెద్దలు* (2) (5:17-22)
    D. వ్యక్తిగతము ("తరచుగా వచ్చు నీ బలహీనతలు") (5:23)
    E. *పెద్దలు* (3) (5:24, 25)

VI. అధ్యాయము 6
    A. *దాసులు* (6:1, 2)
    B. *అబద్ధ బోధ* (3) (6:3-5)
    C. *ధనము* (1): *ధనవంతులుగా ఉన్న వారు* (6:6-10)
    D. వ్యక్తిగతము ("నిత్యజీవమును … పట్టుకొనుము") (6:11-16)
    E. *ధనము* (2): *ధనవంతులైనవారు* (6:17-19)
    F. వ్యక్తిగతము ("నీకు అప్పగింపబడినదానిని కాపాడుము") (6:20, 21)

1 తిమోతి యొక్క సంక్షిప్త వర్ణనను పరిగణించునపుడు, *"అబద్ధ బోధ"* లు అనే భాగమునకు చాలా శ్రద్ధ వహించాలి. అబద్ధ బోధ అనే అంశము ఈ పత్రిక ఆద్యంతం కనబడుతుంది. ఈ చర్చనీయాంశము పై ఈ సంక్షిప్త వర్ణన మూడు ప్రధాన భాగాలను సూచిస్తుంది. చిన్నపైన మరియు సంబంధిత వ్యాఖ్యలు ఇతర భాగములలో కలగలుపబడినవి. మనము చూడబోతున్నట్లుగా, ఎఫెసులోని అబద్ధ బోధకులు సత్యమును వక్రీకరించారు. వారు విశ్వాసమునుండి పైదొలగారు (1:6; 4:1; చూడండి 2 తిమోతి 2:18). వారు అబద్ధములను, కల్పనాకథలను, కట్టుకథలను, మరియు అర్థములేని మాటలను కక్కుతూ ఉన్నారు (1:4, 5; 4:2, 7; 6:3-5; 2 తిమోతి 2:16; 4:3, 4; తీతుకు 1:10, 11; 3:9).

పరిశుద్ధ గ్రంథములోని ఒక పుస్తకమును అధ్యయనము చేయుటకు సిద్ధపడునపుడు, అది ఎలా ఆరంభమౌతుంది ఎలా ముగుస్తుంది అనేది చూడడం కొంత సహాయపడుతుంది. తరచూ మనము ప్రధాన అంశమును కనుగొంటాము. బట్టలు ఆరవేసుకొనే దండెం యొక్క మొదలు చివరలతో ఈ ఆరంభ అంతములను Dale Hartman పోల్చాడు. ఈ దండెం యొక్క స్థంభముల మధ్య ఒక త్రాడును లేదా పైరును కట్టుటను గూర్చి ఆలోచిస్తే, ఆ దండెంమీదనే ఈ పుస్తకములోని అంశములన్నిటినీ ప్రేలాడదీయవచ్చును అని ఆయన సూచించాడు.[28] 1 తిమోతి యొక్క విషయములలోని ఆరంభ మాటలను ఒకసారి చూద్దాం. అబద్ధ సిద్ధాంతములకు వ్యతిరేకముగా ఒక హెచ్చరికను జారీ చేస్తూ ఇది ఆరంభమౌతుంది:

> నేను మాసిదోనియకు వెళ్లుచుండగా సత్యమునకు భిన్నమైన బోధ చేయవద్దనియు, కల్పనాకథలును మితము లేని వంశావళులును, విశ్వాససంబంధమైన దేవుని యేర్పాటుతో కాక వివాదములతోనే సంబంధము కలిగియున్నవి గనుక, వాటిని లక్ష్యపెట్టవద్దనియు, కొందరికి ఆజ్ఞాపించుటకు నీవు ఎఫెసులో నిలిచియుండవలెనని నిన్ను హెచ్చరించిన ప్రకారము ఇప్పుడును హెచ్చరించుచున్నాను (1:3, 4)

అబద్ధ బోధను గూర్చిన హెచ్చరికతో ఈ పుస్తకము ముగుస్తుంది:

> ఓ తిమోతి, నీకు అప్పగింపబడినదానిని కాపాడి, అపవిత్రమైన వట్టి మాటలకును, జ్ఞానమని అబద్ధముగా చెప్పబడిన విపరీతవాదములకును దూరముగా ఉండుము. ఆ విషయములో ప్రవీణులమని కొందరనుకొని విశ్వాస విషయము తప్పిపోయిరి (6:20, 21).

"అబద్ధ బోధ" అనునది ఈ పుస్తకములోని అంశములన్నిటినీ ప్రేలాడదీయునట్టి ఒక సాదృశ్యక దండెముగా కనిపిస్తుంది. అనేకమైన అంశములను మనము చదువుతుండగా, అబద్ధ బోధలు అనే సమూల అంశము ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలా ఒకదానితోనొకటి సంబంధించినదిగా ఉంటుందో మనము గుర్తించగలుగుతాము.

అసలు ఈ అబద్ధ బోధ ఏమిటి? ఈ బోధ యొక్క గుణమును నేను సారాంశపరచాలనుకొంటే, వక్రీకరించబడిన యూదా మతములో గ్రీకు తత్వావాదము మరియు తూర్పుదేశీయుల మార్మికతత్వముల భయానక కలయికతో వండబడిన ఒక డాంభికమైన వంటకముగా ఉంది అని చెప్పవచ్చు - మరియు మరొక ప్రక్క దుష్టత్వముతో కూడిన క్రైస్తవ్యము కూడా ఉంది. ఒక తెలివిపూర్వకమైన మరియు ఆత్మీయమైన భోజ్యముగా పెట్టునటువంటి ఉపద్రవకరమైన వంటకము.

ఎంతటి గొప్ప సవాలును పౌలు తిమోతికి ఇచ్చాడు: ఎఫెసులోని అబద్ధ బోధకులను మరియు బోధలను ఎదిరించి ఓడించమని! అదే సమయములో, సంఘములోని బహిరంగ ఆరాధన మరియు సంఘ నాయకత్వము అను ఇతర అనేకమైన అంశములను గూర్చి కూడా ఆయన కొంచెం పనిచేయవలసి యున్నాడు. మనసుకు జ్ఞాపకమొచ్చే ఒక పోలిక ఏమంటే ఒక గృహముపై అనేకమైన మరమ్మతులను చేయుచున్న వ్యక్తి ... అదియు కూడా తుఫానుకు మధ్యలో!

ఈ బాధ్యతతో పాటుగా తిమోతి యొక్క అనేక బాధ్యతలలో అతను ప్రజలతో వ్యవహరించబోతున్నాడు. కొందరితో, అతడు కొంచెం దురుసుగానే ఉండవలసి వస్తుంది (1:3; 5:20; 6:12). మరి కొందరితో, అతడు మృదువుగా ఉండవలసి ఉంటుంది (5:1, 2; చూడండి 2 తిమోతి 2:24-26). మన సహవాససంబంధాలన్నిటిలో కూడా ఎదుర్కొనే సవాలే అతని సవాలు కూడా: సాధ్యమైనంత ఎక్కువ మంచిని మరియు తక్కువ కీడును ఇతరులకు చేయడమే.

ఒక సంఘము బలముగలదిగా ఉండునంతగా నిర్మించడం అనేది ఎప్పటికీ సంపూర్ణం కానంత పని. ఈ పత్రికను గూర్చిన మన అధ్యయనంలో, ఎఫెసులోని సంఘమును బలపరచు నిమిత్తము పౌలు ఏ విధముగా తిమోతిని ఆజ్ఞాపించాడో చూడగలుగుతాము.

ఈ అధ్యయనముము మనము ఒక భావముతో మరియు ఒక సమర్పణతో పరిగణిస్తాము. భావము ఏమనగా 1 తిమోతి పత్రిక దేవుని వాక్యము, "దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16). సమర్పణ ఏమనగా దీనిని అర్థము చేసికొనుటకు మనకు చేతనైనంత వరకు చేయడం (1) తిమోతికి వాక్యము ఏమి చెప్పుంది మరియు (2) అది మనకు ఏమి చెప్తుంది. ఆయన వాక్యము "తీవ్రతతో చదవబడాలని, క్షుణ్ణంగా అర్థం చేసుకొనబడాలని, మరియు నమ్మకముగా అన్వయింపబడాలని" దేవుడు ఆశిస్తున్నాడు.[29]

## 1, 2 తిమోతి మరియు తీతుకు పత్రికలలోని అంశము

### "హిత వాక్యము"

1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికలలో పౌలు యొక్క ప్రధాన ఆలోచన సత్యము అనేది కాపాడబడాలి, సంరక్షించబడాలి మరియు ప్రయోగించబడాలి. పత్రికలలో మూల పదము "హిత." పౌలు "హితవిశ్వాసము" మరియు "హితవాక్యము" అనే భావాలను (తీతుకు 2:2, 8) ప్రయోగించాడు, కానీ ప్రాముఖ్యంగా "హితబోధ" మరియు "హితమాటలు" అనే మాటలను కూడా ప్రయోగించాడు (6:3; 2 తిమోతి 4:3; తీతుకు 1:9; 2:1).[30]

"హిత" అని అనువదించబడిన గ్రీకుపదము (ὑγιαίνω, *hugiainō*) ఆంగ్ల పదమైన "hygiene" (అంటే, పరిశుభ్రమైన) అను మాటకు మూలము, దీని అక్షర అర్థము "ఆరోగ్యముగా ఉండు," "మంచి భౌతిక ఆరోగ్యముతో నుండు." సాదృశ్యకరంగా ప్రయోగించునపుడు, ఈ పదము "మంచిగా ఉండు లేదా తప్పిదము లేకుండ నుండు, ఖచ్చితముగా ఉండు" అనే అర్థాలను ఇస్తుంది.[31] అక్షర అర్థమును మరియు సాదృశ్యక అర్థములను కలిపితే, "హిత బోధ" అనగా తప్పిదములే లేకుండునట్టి బోధ మరియు ఆత్మీయ ఆరోగ్యమును పెంపొందించునట్టి బోధ అని అర్థము వస్తుంది. 2 తిమోతి 4:3లో, NEB అనువాదమునకు "సంపూర్ణమైన బోధ" అని ఉంది. మరొక అనువాదమునకు "ఆరోగ్యకరమైన బోధ" అని ఉంది.[32]

దీనికి భిన్నంగా, మనము "*హితబోధకాని బోధ*"ను గూర్చి కూడా జాగ్రత్త వహించాలి: అనగా తప్పిదములు ఉండే బోధ, ఆత్మీయ రుగ్మతలను పెంపొందించు బోధ అని అర్థము. 1 తిమోతి 6:4లో, "తర్కములనుగూర్చియు వాగ్వాదములను గూర్చియు వ్యర్థముగా ప్రయాసపడుచు గర్వాంధుడు"ను గూర్చి పౌలు మాట్లాడాడు. "గర్వాంధుడు" అనే మాట νοσέω (*noseō*) అనే గ్రీకు పదము నుండి గ్రహించబడింది, దీని అర్థము "బలహీనమైన, రుగ్మతగల." దీనికి సమీప నామవాచకము νόσος (*nosos*) అక్షరార్థముగా "భౌతిక రుగ్మత, రోగము, బలహీనత" మరియు సాదృశ్యకరంగా "నైతిక రుగ్మత, రోగము"ను సూచిస్తుంది.[33] NIV అనువాదము *noseō* అనే ఈ మాటను "అనారోగ్యకరమైన" ("అనారోగ్యకరమైన ఆసక్తి" అనే మాటలో) గా

అనువదిస్తుంది.

ఎఫెసులో తిమోతి యొక్క బాధ్యతలను గూర్చి పౌలు వివరించగా, తన జాబితాలో మొదటి హితముకాని మరియు అనారోగ్యకరమైన బోధను ఎదిరించడమే ఉంది: "సత్యమునకు భిన్నమైన బోధ చేయవద్దనియు ... కొందరికి ఆజ్ఞాపించుటకు నీవు ఎఫెసులో నిలిచియుండవలెనని నిన్ను హెచ్చరించిన ప్రకారము" (1:3, 4). ఈ మూడు పత్రికలలో కూడా అబద్ధ బోధను పరిగణించడం అనేది మరలా మరలా పునరావృతమౌతున్న అంశంగా ఉంది, కాబట్టి ఈ వాక్యమును గూర్చిన వచనము వెంబడి వచనము యొక్క అధ్యయనమును ఆరంభించుటకు ముందు ఈ "భిన్నమైన బోధ"లను గూర్చి కొంత చర్చించుకోవడం మనకు సహాయపడే విషయం.

## "భిన్నమైన బోధ"లకు విరుద్ధముగా హెచ్చరికలు

"సత్యమునకు భిన్నమైన బోధ చేయవద్దు ..." అని 1:3లో పౌలు ఇచ్చిన ఆజ్ఞను బట్టి చూస్తే "అప్పటికే గుర్తించబడదగ్గ ప్రామాణికమైన క్రైస్తవ సిద్ధాంతము అనేది ఒకటి ఉన్నది" అని తెలుస్తుంది.[34] తిమోతికి పౌలు వ్రాసిన రెండవ పత్రికలో, "నీవు నావలన వినిన హితవాక్య *ప్రమాణమును* గైకొనుము" అని వ్రాసాడు (2 తిమోతి 1:13; ఉద్ఘాటన జోడించబడింది).

సత్యసందేశము పౌలుకు అప్పగింపబడెను (తీతుకు 1:3 ప్రకారం), దీనిని ఆయన తిమోతికి అందించాడు (6:20; 2 తిమోతి 1:14), మరియు తిమోతి దీనిని ఇతరులకు అందించవలసినవానిగా ఉన్నాడు (2 తిమోతి 2:2). సత్యము అనేది ప్రశస్తమైనది. దానిని తేలికగా తీసుకోకూడదు. ఈ కారణము చేత, పౌలు పొరపాటు అనేదానిని భరించలేడు భరించడు కూడాను. గలతీయులకు వ్రాస్తూ, "మీరు అంగీకరించిన సువార్త [అనగా, పౌలు నుండి అంగీకరించిన సువార్త] గాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవును గాక" అని అన్నాడు (గలతీ. 1:9).

*హెచ్చరిక: ఆత్మలు నశించిపోతాయి!* ఇక్కడ మనము పరిగణిస్తున్న అబద్ధ బోధకుల విషయములో, "కొరుకుపుండు ప్రాకినట్టు వారిమాటలు ప్రాకును" అని పౌలు హెచ్చరించాడు (2 తిమోతి 2:17). లిప్యాంతరీకరణ చేయబడిన గ్రీకు పదమును (γάγγραινα, *gangraina*), "కొరుకుడు పుండును, లేదా కాన్సర్ ను" తెలుపునటువంటి పదమును - "'తినివేసెడి గాయము,' దుష్టత్వమును వెదజల్లుతూ మర్త్యతను [మరణమును] ఉత్పన్నం చేయునది అనే పదమును ప్రయోగించాడు."[36] "వారి బోధ కాన్సర్ వలే [తినును] తినివేయును లేదా కొరుకుడుపుండు వలే ప్రాకును" అని AB అనువాదములో ఉంది. కొరుకుడు పుండు ప్రాకకుండు నిమిత్తము తమ కాలును లేదా చేతిని పోగొట్టుకొనిన ఒకనిని మీరు ఎరుగుదురా? కాన్సర్ రోగముచే తినివేయబడుతున్న ఒక వ్యక్తి యొక్క పడక ప్రక్కన ఎప్పుడైనా కూర్చుండియున్నారా? ఒకవేళ అలా చేసినట్లయితే, పౌలు యొక్క పదజాలములోని స్పష్టత మీకు తెలుస్తుంది.

*హెచ్చరిక: విశ్వాసము చెరుపబడుతుంది!* పౌలుచే తిమోతి విడువబడిన ఎఫెసు మరియు క్రేతులోని అబద్ధ బోధ అనునది "అసూయ కలహము దూషణలు దురను

మానములును చెడిపోయిన మనస్సు"నకు దారితీసింది (6:4, 5). అది క్రైస్తవుల యొక్క "విశ్వాసమును చెరిపి"వేసి (2 తిమోతి 2:18) "కుటుంబములకు కుటుంబములనే పాడుచేసి"నది (తీతుకు 1:11). ఈ అబద్ధ బోధకుల సందేశమును పౌలు "విషయములను పరిగణించు మరొక మార్గము"గానో లేదా "ఒక ప్రత్యామ్నాయ ఆత్మీయ మార్గము"గానో చూడలేదు. అది ఒక *అబద్ధ బోధ,* "వినువారిని చెరుపుటకే" దారితీసే కాన్సర్ వంటి సందేశము అది (2 తిమోతి 2:14).

*హెచ్చరిక: సువార్త ప్రకటింపబడదు!* పౌలు యొక్క ప్రధాన ఆలోచనలలో ఒకటి ఈ అబద్ధ బోధ అనునది ప్రజలను సువార్త నుండి ఎలా తొలగిస్తుందో అనేది. అది "పనికిరానిది" (2 తిమోతి 2:14), "అవివేకమైనది," "నిష్ ప్రయోజనమైనది మరియు వ్యర్థమైనది"గా ఉంది (తీతుకు 3:9). అది ప్రభువు యొక్క కార్యమును వృద్ధిపొందించుటకు బదులుగా అది "వివాదములతోనే సంబంధం కలిగియున్నది" (1:4). అది మనుష్యులను "నిష్ ప్రయోజనమైన ముచ్చటల" వైపు త్రిప్పింది. దానిని బోధించుటలో లేదా దానిని వాదించుకొనుటలో వెచ్చించు సమయము సువార్తను ప్రకటించుటలో, ఆత్మలను రక్షించుటలో, మరియు క్రైస్తవులను బలపరచుటలో ఉపయోగించవలసిన సమయము. అది సువార్త నుండి ఏకాగ్రతను ప్రక్కకు మళ్ళించునట్లు అపవాది పన్నిన ఒక వ్యూహము (చూడండి 2 తిమోతి 2:26).

అబద్ధ బోధ అనునది "అవివేకము" కంటే ఎక్కువనే అని తిమోతి - అలాగే క్రైస్తవులు అందరు కూడా - తెలుసుకోవాలని పౌలు భావించాడు. అబద్ధ బోధ అనునది ఆత్మను, ఒక సంఘమును, లేదా సహోదరత్వమును నాశనము చేయగలదు (చూడండి తీతుకు 1:11). వాక్యముతో నిలిచి ఉండుటకు మరియు అది ఏమి చెప్తుందో దానిని చేయునట్లు తీర్మానం తీసుకొనుటకు మనలో ప్రతి ఒక్కరమూ నిర్ణయము తీసుకోవాలి (2 తిమోతి 4:2; తీతుకు 1:9).

## అనారోగ్యకరమైన బోధను గుర్తించడం

తిమోతి ఎదుర్కొనవలసిన ఆ బలహీనమైన బోధ ఏమైయున్నది? ఆ ప్రశ్నకు ఈ వాక్యభాగము వివరణాత్మక జవాబు ఇవ్వడం లేదు, కాని బోధింపబడిన తప్పిదమును గూర్చి మనకు అనేకమైన సూచనలు ఉన్నాయి. అది వంచబడిన యూదా మతము, గ్రీకు తత్వశాస్త్రము, తూర్పు వారి మార్మికతత్వము మరియు భ్రష్టత్వముతో నిండిన క్రైస్తవ్యము అనే వాటితో కలగలిపి ఉండినదిగా అనిపిస్తుంది.

*వంచబడిన యూదామతము.* ఈ "భిన్నమైన బోధల" లో వంచబడిన యూదామతమే ప్రసిద్ధముగా కనిపిస్తుంది. "సత్యమునకు భిన్నమైన బోధ చేయవద్దనియు, కల్పనాకథలును మితము లేని వంశావళులును, ... లక్ష్యపెట్టవద్దనియు" ప్రజలకు బోధించునట్లు తిమోతి చెప్పబడ్డాడు (1:3, 4). 1:6, 7 వచనములలో, *"ధర్మశాస్త్రోపదేశకులై"* ఉండాలనుకొనిన "కొందరిని" పౌలు గుర్తించాడు (ఉద్ఘాటన కల్పితం). ఆ తరువాత పది ఆజ్ఞలకు సంబంధించిన పాపముల జాబితాను ఇవ్వడం ద్వారా ఆయన "ధర్మశాస్త్రము" ను గుర్తించాడు (1:9, 10).

తీతుకు పౌలు వ్రాసిన పత్రికలో, అబద్ధ బోధకులను గూర్చి కూడా అపొస్తలుడు

హెచ్చరికలు ఇచ్చాడు. "అనేకులు, *విశేషముగా సున్నతి సంబంధులును* ... యున్నారు" అని అయన అన్నాడు (తీతుకు 1:10; ఉద్ఘాటన జోడించబడింది"యూదుల కల్పనాకథలను, ... మనుష్యుల కట్టడలను లక్ష్యపెట్టక" ఉండాలని పౌలు తీతును బ్రతిమాలుకున్నాడు (1:14). క్రేతులో ఉన్న అనేక, బహుశ అధికమైన, అబద్ధ బోధకులకు యూదామత పూర్వము ఉండే ఉంటుంది.[37]

మునుపు, "మోషే నియమించిన ఆచారము చొప్పున సున్నతి పొందితేనే గాని" వారు రక్షింపబడజాలరని యూదా మతమునకు చెందిన బోధకులు[38] సంఘమును చేరిపివేసారు (అపొ. 15:1). ఈ అబద్ధ బోధను పౌలు నేరుగానే ఎదుర్కొన్నాడు. "యేసుక్రీస్తునందుండువారికి సున్నతిపొందుటయందేమియు లేదు, పొందకపోవుటయందేమియు లేదు గాని ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజనకరమగును" అని గలతీయులకు 5:6లో వ్రాసాడు (చూడండి 1 కొరింథీ. 7:19; గలతీ. 6:15). అయినప్పటికీ, సున్నతి అనే అంశంపై దృష్టి కొంత మేర తగ్గిందనే చెప్పాలి - కనీసం ఎఫెసులోనైనా. ప్రస్తుత యూదా సమస్య అంతయు "కల్పనాకథలు" మరియు "వంశవళులు"తోనే ఉంది (1:4).[39]

పాత నిబంధన వంశావళులతో నిండుకొని ఉంది. ఈ వంశావళులు ఆయా గోత్రముల యొక్క భూస్వాస్థ్యములను నిర్మించుటకు అవసరవమైనవి. యాజక కర్తవ్యాలను మరియు రాజరిక వంశాలను కూడా నిశ్చయించుటకు అవి దోహదపడినవి. అనేకమంది యూదులకు, నేడు లౌకిక వంశావళులుగా కూడా సహాయపడినవి: ఒకరి స్వాస్థ్యమును నిరూపించుటకు. యూదులు ఎవరో అనే విషయాన్ని నిర్వచించుటకు వంశావళులు ప్రాముఖ్యము.[40]

ఈ వంశావళులు రబ్బీలను చాలా ఆకట్టుకొన్నాయి; కొద్దిగా లేదా అసలు తెలియని వ్యక్తులను గూర్చి వారు ప్రత్యేకముగా ఆసక్తి కలిగియున్నారు. ఆ వ్యక్తి ఎవరు మరియు ఆయన ఏమి చేసాడో అనే విషయాలపై ఒక సుదీర్ఘమైన కథను వారు అల్లేవారు. వివరణాత్మకంగా వారి "ప్రేరేపణపై చేసిన ఈ బుట్టాపనులు" సమాజమందిరములలో సర్వసామాన్యములు మరియు మరియు "*హగాద్దా*గా పిలువబడే *తాల్మూడ్* యొక్క ఆ భాగములో వ్రాతపూర్వకముగా ఇవి భద్రపరచబడినవి."[41]

ఈ వంశావళులను ఎలా పరిగణించేవారో అనేదానికి ఉదాహరణ జూబిలీస్ అనే కడవరికాలమును గూర్చి మాట్లాడే పుస్తకములో వ్రాయబడింది.[42] ఈ పుస్తకములో, సుమారు క్రీ.పూ. రెండవ లేదా మొదటి శతాబ్దమునకు చెందిన ఈ పుస్తకములో, ఆదికాండమును మరియు నిర్గమకాండము యొక్క ఆరంభ అధ్యాయాలను రచయిత కొంత విపులపరచాడు. ఆదాము మొదలుకొని తెరహు వరకు ఉన్న పితరుల అందరికీ కూడా తమ తమ భార్యల పేర్లను ఈ రచయిత కనిపెట్టాడు. పితరులను గూర్చి కొన్ని కథలను రచించాడు. హెబ్రీ భాష పరలోక భాష అనియు, ఏదేను తోటలో మానవుడు మరియు మృగాలు అన్నియు హెబ్రీ భాషలోనే మాట్లాడేవనియు, కాని దూతలు ఈ భాషను అబ్రాహామునకు బోధించునంతవరకు కూడా ఈ భాష మరచిపోబడినదనియు ఆయన చెప్పాడు. ఈ పుస్తకము ఇతర కట్టుకథలను కూడా కలిగియుంది: విశ్రాంతి దినమును ప్రధాన దూతలు ఆచరించేవి, దూతలు కూడా సున్నతి చేసుకొనేవి,

మరియు యాకోబు ఎవరినీ కూడా మోసం చేయలేదు అనే కథలు ఇందులో ఉన్నాయి.[43]

ఈ విధమైన ఆకర్షణీయ కథల ఉత్పత్తికి ప్రేరణ ఈ కారణాల వలన వచ్చేది: (1) యూదా మత ఆచారాలు ఆరంభం నుండి కూడా పాటించబడుతూ ఉండేవి అని నిరూపించడానికి, మరియు (2) యూదా పితరులను అనుకూల విధానములో అందించడానికి మరియు తమ యోగ్యతను బట్టే దేవుడు తనకు ప్రజలుగా ఉండుటకు యూదా ప్రజలను ఎన్నుకొన్నాడు అని తద్వారా సూచించడానికి. బైబిలు వాక్యమును గూర్చి చూస్తే, ఈ విధమైన రచనలు చేసే రచయితలు *ఎక్సెజీసిస్* బదులు *ఐసిజీసిస్* చేసేవారు. *ఐసిజీసిస్* అనగా ఒకరి సొంత ఆలోచనలను వాక్యము*లోనికి*[44] చదవడం, కానీ *ఎక్సెజీసిస్* అంటే దేవుని సందేశమును వాక్యము *నుండి*[45] వెలికితీయడం.

"కానీ ఈ కట్టుకథలు మరియు వంశావళులు అన్నీ పాతనిబంధనకు చెందినవికదా. క్రైస్తవులు క్రీస్తు యొక్క క్రొత్తనిబంధనకు చెందినవారు. ఎఫెసులో ఉన్న సంఘము వంటి ఒక సంఘముపై ఈ యూదా వారి కట్టుకథలు మరియు వంశావళులు ఎందుకు ప్రభావితము చేస్తాయి?" అని ఎవరైనా స్పందించి అడగవచ్చు. ఆ సమయములో, అనేకమంది క్రైసవులకు అందుబాటులో ఉండిన లేఖనములు పాతనిబంధన పుస్తకములు మాత్రమే. (క్రొత్తనిబంధనలోని ప్రేరేపితమైన పుస్తకములన్నియు వ్రాయబడి, ప్రతిగా చేయబడి, పంచిపెట్టబడి, మరియు ఆఖరుగా అన్నిటినీ కూర్చిన సమయమునకు కొంచెం ముందు జరిగిన సంఘటనలు ఇవి.) కాబట్టి, ప్రభువు సంఘములోని బోధలో ఎక్కువ శాతము పాతనిబంధన వాక్యముతో లేదా కథతోనే ప్రారంభమయ్యేవి. రబ్బీల యొక్క కట్టుకథలను మరియు కల్పనాకథలను పరిచయం చేయుటకు ఇది చాలా అనువైన ప్రవేశంగా పనిచేసింది.

"అయినప్పటికీ అసలు దానిలో ఏమి హాని ఉంది? కట్టుకథలు అనునవి కేవలము హానికలిగించని ఆకర్షణీయ కల్పనలే కదా" అని మరొకరు అడగవచ్చు. "నిష్ప్రయోజనమైన ముచ్చట" లుగా పౌలు అభివర్ణించిన వాటికి ఈ కట్టుకథల బోధ దారితీసింది (1:6). ఇంకా చూస్తే, ప్రత్యక్షపరచబడిన దేవుని యొక్క చిత్తము చాలనిదిగా ఉంది[46] కాబట్టి మానవ ఊహాగానాలతో దానిని పూరించాలి అని ఈ కట్టుకథలను రచించినవారు చెప్తున్నారు. ఇంకా చూస్తే, లేఖనములను ఒక వ్యక్తి కొంచెం సవరించి ఏమైనా కలపవచ్చు అన్నప్పుడు, వేరే ఎవరైనా సరే అలా చేయుటకు వీలు ఉంటుంది కదా;[47] అప్పుడు లేఖనముల యొక్క చెరపరానితనమునకు భంగము వాటిల్లుతుంది. ఈ కట్టుకథలు ఎంతమాత్రమైనప్పటికీ హానికరమైనవే.

*ఇతర విషయాలు.* ఎఫెసులోని అబద్ధ బోధకు యూదామత సంబంధం ఉండగా, ఇతర విషయాలు కూడా ఉన్నాయి. రాబోవుచున్న భ్రష్టత్వమును గూర్చి పౌలు తిమోతిని హెచ్చరించినప్పుడు (4:1-5; 2 తిమోతి 3:1-5), పేర్కొనబడిన అబద్ధ సిద్ధాంతములను కొందరు అప్పటికే బోధిస్తున్నారు అని ఆయన సూచించాడు (2 తిమోతి 3:5, 6). దీనిని మనసులో ఉంచుకొని, 1 తిమోతి 4:3లో పేర్కొనబడిన సైద్ధాంతిక పొరపాట్లలో ఒకదానిని మనము ఇక్కడ పరిగణనలోనికి తీసుకుందాము: వివాహము యొక్క నిషేధము. పాతనిబంధనను అనుసరించేవారు ఎన్నటికినీ ఈ నియమమును మాత్రము ప్రకటింపరు (ఆది. 1:27, 28; 2:24). మరలా, 2 తిమోతి

2:18లో, “పునరుత్థానము గతించెనని చెప్పుచు సత్యము విషయము తప్పిపోయి”న అబద్ధ బోధకులను గూర్చి పౌలు మాట్లాడాడు. యూదా ధర్మశాస్త్రమును ఖండితముగా పాటించేవారు (పరిసయ్యులు వంటి వారు) శారీరక పునరుత్థానమందు దృఢముగా విశ్వసించినవారు (అపొ. 23:8). కాగా, వివాహమును నిరుత్సాహపరచి శారీరక పునరుత్థానమును నిరాకరించునట్టి తప్పుడుబోధ యొక్క మూలము ఏమై ఉంటుంది అని మనము అడగాలి.

సాధ్యమగు ఒక మూలము ఏమనగా “పూర్వ-జ్ఞానతత్వశాస్త్రము.” జ్ఞానతత్వశాస్త్రము అనునది “సంఘము యొక్క మొదటి రెండు శతాబ్దములకు చెందిన అత్యంత ప్రమాదకరమైన తప్పుడు బోధలలో ఒకటి.”[48] జ్ఞానతత్వశాస్త్రము అనే మాట “జ్ఞానము”నకు గ్రీకు పదమునుండి తీయబడింది: *γνῶσις* (*gnōsis*). జ్ఞోసిస్ ను “జ్ఞానము”గా 1 తిమోతిలో అనువదించారు: “ఓ తిమోతి, నీకు అప్పగింపబడినదానిని కాపాడి, ... ‘జ్ఞానమని’ అబద్ధముగా చెప్పబడిన విపరీతవాదములకును దూరముగా ఉండుము” (6:20). ఇతరులకు అందుబాటులో లేని ఒకవిధమైన “జ్ఞానము”ను వారు కలిగియున్నారు అని జ్ఞానతత్వవాదులు (జ్ఞాస్టిక్స్) చెప్పుకొనేవారు. కొలస్సీలో ఉన్న క్రైస్తవులకు తన పత్రికను వ్రాసినప్పుడు పౌలు ఈ జ్ఞానతత్వశాస్త్రము యొక్క ఆరంభ దశను గూర్చి మాట్లాడుతున్నట్లుగా ఉన్నాడు (కొలస్సీ. 2:8, 18-23), కొలస్సీ పట్టణము ఎఫెసు నుండి పెద్ద దూరములో లేని పట్టణము (సుమారు 120 మైళ్ల దూరములో మాత్రమే ఉంది). తరువాత, బహుశ ఎఫెసులో జీవిస్తున్నప్పుడు, మొదటి శతాబ్దపు అత్యంత కటపమైన పొరపాట్లలో ఒకదానిని గూర్చి యోహాను ప్రస్తావించాడు (1 యోహాను 4:1-3; 2 యోహాను 7; చూడండి యోహాను 1:14), ఇది జ్ఞానతత్వశాస్త్రమునకు ఆరంభంలో ఇది భాగమై ఉండవచ్చు.

జ్ఞానతత్వవాదులు బోధ ప్రకారం, పదార్థము (శరీరముతో సహా) అనేది ఏదైనా అవసరంగా చెడ్డది గనుక క్రీస్తు శరీరమందు వచ్చి ఉండడు, ఈ భావన గ్రీకు తత్వశాస్త్రము నుండి తీసికొనబడినది. ఈ లోపభూయిష్టమైన భావనకు కలిగిన ఫలితములలో ఒకటి ఒక విధమైన మునివృత్తి/వైరాగ్యము. శరీరము చెడ్డది కాబట్టి భోగపూరితమైనదేదైనా తృణీకరింపబడాలి అని ఈ మునివృత్తిని అనుసరించువారు చెప్పేవారు. కాబట్టి, రెండవ శతాబ్దములో, వివాహము చేసుకొని పిల్లలను కనడం అనే ఆలోచనను జ్ఞానతత్వ వాదంను బలంగా ప్రతిపాదించే వాదకులు నిరుత్సాహపరచేవారు.[49] (ఈ సిద్ధాంతం ప్రకారముగా) శరీరము చెడ్డది గనుక, శారీరకమైన పునరుత్థానము అనేది అసాధ్యము అని వీరు మరియు ఇతరులు బోధించారు. ఆత్మీయ పునరుత్థానమందే[50] వీరు నమ్మికయుంచారు: అనగా, బాప్తిస్మము యొక్క నీళ్లలో నుండి జీవితము యొక్క నవీనత్వములో నడచుటకు లేపబడినప్పుడు, మునుపు ప్రతి క్రైస్తవుడు అనుభవించిన ఆత్మసంబంధమైన పునరుత్థానము (రోమా. 6:3-6). (*అదనపు అధ్యయనం కొరకు: జ్ఞానతత్వవాదం యొక్క ఆరంభ రూపము,* పేజీలు 22-24 వరకు చూడండి.)

తూర్పు దేశములకు చెందిన మార్మికతత్వము ఎఫెసులో జరిగిన సైద్ధాంతిక మిశ్రమములోనే బహుశ భాగమైయుండవచ్చు, ఎందుచేతనంటే ఎఫెసు అనేది ప్రాచీన ప్రపంచంలో ఇటువంటి క్షుద్ర కేంద్రాలలో ఒకటి. “గ్రీసు-రోమా సామ్రాజ్యమునకు చెందిన

పట్టణములన్నిటిలోకెల్లా ఎఫెసు ... మాంత్రికులకు, సోదెగాండ్రకు మరియు సకలవిధములైన కుహనా మేధావులకు అత్యంత ఆతిథ్యకరమైన స్థలము."[51] "క్షుద్ర" అనగా "రహస్యమైన" మరియు రహస్యమైన లేదా మరుగున ఉన్న రహస్యముల లేదా జ్ఞానమును సూచించునదిగా ఉంది. ఎఫెసులో ఉన్నవారి మనసులు "రహస్యమైన జ్ఞానము" అనే భావనను అంగీకరించునట్లు ముందుగానే సిద్ధపరచబడినవి.

1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికలలో ఉన్న సూచనలను తీసుకొని, యూదామత సంబంధం కలిగిన క్రైస్తవులు తమకు సొంతదైన ఒక విధమైన "క్రైస్తవ" సిద్ధాంతమును వండుటకు గ్రీకు తత్వశాస్త్రమును మరియు తూర్పు దేశములకు చెందిన మార్మికతత్వములలోని కొంత భాగమును కలిపారు అని చెప్పవచ్చును. కేవలము వారికి మరియు వారి క్రిందనున్న వారి శిష్యులకు మాత్రమే అందుబాటులో ఉండే "జ్ఞానము"గా దీనిని వారు సమర్పించారు.

వారి సిద్ధాంతము యొక్క గుణము ఏమైయుండినప్పటికీ కూడా, ఎఫెసు సంఘములో ఉండిన అబద్ధ బోధకులు చాలా అహంకారులుగా ఉండినారు. ఒకవిధముగా వారు, "జ్ఞానమే అన్నిటికంటే ప్రాముఖ్యము. ఆఖరుకు పౌలుకు కూడా లేనటువంటి జ్ఞానమును మేము కలిగియున్నాము. ఏర్పరచబడిన కొద్దిమందికి మాత్రమే చెందిన జ్ఞానము ఇది - మరియు మీరు ఈ జ్ఞానము కొరకు మా వద్దకు రావలసియున్నారు" అని అంటున్నారు. పౌలు వారిని "గర్వాంధులు" అని పిలుస్తూ (6:4) వారి సిద్ధాంతమును "జ్ఞానమని *అబద్ధముగా* చెప్పబడిన" దానిలా ముద్రించాడు (6:20; ఉద్ఘాటన జోడించబడింది).

ఎఫెసులోని "అనారోగ్యకరమైన బోధ" విషయములో చాలా ప్రత్యేకముగా ఉండడం అనేది పౌలుకు చాల అవసరమైనదిగా ఉంది. అది ఏమిటో ఆయనకు తెలుసు, తిమోతికి అది ఏమిటో తెలుసు, మరియు ఎఫెసులోని సంఘములో ఉన్న విశ్వాసులకు కూడా అది ఏమిటో తెలుసు. మనకు తెలియదు, కానీ నేటికాలపు అబద్ధ బోధలను గూర్చి కొంత అన్వయింపును గ్రహించుటకు ఇది మనకు సులభతరం చేస్తుంది:

- దేవుని వాక్యమునకు కలుపునట్టి ఎట్టి బోధయైనను - "కట్టుకథలు" వలే (1:4) - అది అనారోగ్యకరమైన బోధయే.
- దేవుని వాక్యము నుండి ఏదైనా తీసివేసే బోధ - "పునరుత్థానము" గతించెనని చెప్పిన బోధవంటిది (2 తిమోతి 2:18) - అనారోగ్యకరమైన బోధయే.
- మన రక్షణార్థమైన దేవుని ప్రణాళిక నుండి (1:4, 15) మనసును త్రిప్పునట్టి బోధ ఏదైనను - 1:3లో చెప్పబడిన "భిన్నమైన బోధలు" చేసినట్లుగా - అనారోగ్యకరమైన బోధయే.
- "అసూయ, కలహము, దూషణలు, దురనుమానములు, మరియు చెడిపోయిన మనస్సు" (6:4, 5) నకు దారితీసే బోధ ఏదైనా - 1:3లో చెప్పబడిన "భిన్నమైన బోధలు" చేసినట్లుగా - అది అనారోగ్యకరమైన బోధయే.

అట్టి బోధ యొక్క నివేదించు శక్తిని పౌలు అర్థం చేసుకున్నాడు. అనేకమంది

తమకు “దురద చెవులు” ఉండాలని ఆశిస్తారు (2 తిమోతి 4:3), సత్యమైనదాని కంటే కూడా ఎక్కువగా క్రొత్తదానిని ఎక్కువగా పట్టించుకొనేవారు వీరు. అతనికి అప్పగింపబడిన సత్యమును జాగ్రత్తగా కాపాడమని పౌలు తిమోతిని బలంగా బ్రతిమాలుకున్నాడు (6:20), “వాక్యమును బోధించాలని” (2 తిమోతి 4:2), మరియు “భిన్నమైన బోధను బోధింపకుండు” నిమిత్తము అబద్ధ బోధకులకు హెచ్చరించాలని (1 తిమోతి 1:3) చెప్పబడ్డాడు.

## అదనపు అధ్యయనం కొరకు: జ్ఞానతత్వవాదం యొక్క ఆరంభ రూపము

రెండవ మరియు మూడవ శతాబ్దములలో సంఘములో పెచ్చురిల్లిన తత్వశాస్త్రీయ దుర్బోధల అనేకమైనవాటిని కప్పే ఈ “జ్ఞానతత్వ వాదం” అనే పదము ఒక గొడుగు పదము లాంటిది. “జ్ఞానము”నకు గ్రీకు సమాన పదము నుండి ఇది గ్రహించబడినది: γνῶσις (*gnōsis*). దీని ప్రధాన ప్రభావం ఎక్కువగా తమ్ముతాము తెలివైనవారిగా పరిగణించుకొనే వారిపైనే. విశ్వాసము ద్వారా విషయములను అంగీకరించుటకు ఇష్టత లేక, వారు హేతువాదమును మరియు ఊహాగానాలను ఎక్కువగా పరిగణించారు. ఈ జ్ఞానతత్వవాదులు సంపన్నులుగా, జ్ఞానవంతులుగా - అనగా మానవాళి అంతటిలో మిగిలిన వారికి సహితము ప్రత్యక్షపరచబడని ఒక ప్రత్యేకమైన రహస్య జ్ఞానమును పొందుకొనిన తత్వవేత్తలుగా తమ్ముతాము భావించుకుంటారు.

మిగిలిన అన్ని దుర్బోధల కంటే కూడా రెండవ శతాబ్దపు సంఘమునకు మరి ఎక్కువ హానిగా ఉండిన జ్ఞానతత్వవాదుల ఆలోచన మార్షియోనిజం అనే దుర్బోధ. సుమారు క్రీ.శ. 140లో మార్షియన్ రోమాలో బోధించడం మొదలుపెట్టాడు. అతడు ఆఖరుకు “సంఘ పితరులచే” బహిష్కరించబడి చిన్న ఆసియాకు తిరిగి వచ్చాడు, అక్కడ కూడా అతడు అనేక సంఘములను తప్పుదోవ పట్టించడం మొదలుపెట్టాడు. టెర్టూల్లియన్ రచించిన *Against Marcion* అనే అయిదు భాగాలు గల పుస్తకము ఆధారముగానే ఈ మార్షియాన్ యొక్క బోధలను గూర్చి మనకు తెలుస్తుంది, ఇది సుమారు క్రీ.శ. 208లో వ్రాయబడింది.

జ్ఞానతత్వవాదుల ఆలోచన గల పాఠశాలలలో కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయి, కాని ప్రధానమైన విషయం ఏమంటే ఆత్మ అనేది సమూలంగా మంచిది కాగా పదార్థము అనేది సమూలంగా చెడ్డది అనే భావన. వక్రీకరించబడిన ఈ భావన వలన ఈ శరీరమును ఎలా చూడాలో అనే విషయముపై పూర్తిగా రెండు భిన్నమైన అభిప్రాయాలు వెలువడ్డాయి. ఒకటి అసహజమైన మునివృత్తి: అనగా సౌభాగ్యవంతమైనది దేనినైనా మరియు ప్రతిదానినీ విడచి శరీరమును తృణీకరించడం, బహుశ శరీరమును దండించుకోవడం కూడా ఉండచ్చు. మరొక అభిప్రాయము ఈ ఆలోచనపై ఆధారితమైన దిగ్భ్రాంతికర జారత్వము: “ఆత్మ మాత్రము ఆత్మీయ ఆలోచనలు అనే రెక్కలపై వెళ్ళనివ్వడం, కాగా శరీరము మాత్రము శరీర కోరికలపై ఆశ నిలపడం.”

పదార్థము అంతయు చెడ్డది అనే భావన వలన వచ్చిన భయానక ఫలితము

ఏమంటే క్రీస్తు శరీరమందు రాలేదు - లేదా వచ్చి ఉండడు అని. క్రీస్తు యొక్క శరీరము కేవలము భ్రాంతిపర్వమే (డొసెటిసిసం) అని కొందరు జ్ఞానతత్వవాదులు బోధించగా తన బాప్తిస్మములో ఆయన యేసు యొక్క మానవ శరీరములోనికి ప్రవేశించి తన మరణమునకు ముందే విడచాడు (సెరిన్థియనిసం) అని ఇంకొందరు బోధించారు. ఈ తదుపరి దుర్బోధను యోహాను యోహాను 1:14; 1 యోహాను 4:2; మరియు 2 యోహాను 7లో బలంగా వ్యతిరేకించాడు.

క్రొత్తనిబంధనలో చర్చించబడిన దుర్బోధ - జ్ఞానతత్వ వాదం యొక్క ఆరంభ రూపమే కాని రెండవ మరియు మూడవ శతాబ్దములో జటిలముగా వృద్ధినొందిన విధానము కాదు. ఈ “పూర్వ-జ్ఞానతత్వ వాదం” అనేది కొంతమంది క్రైస్తవుల ఆలోచనను అప్పటికే ప్రభావితము చేసినది అని క్రొత్తనిబంధనలోని కొన్ని పుస్తకములు సూచిస్తున్నాయి (ఉదాహరణకు, చూడండి కొలస్సీ. 2:21-23). మొదటి మరియు రెండవ తిమోతి మరియు తీతుకు పత్రికలు కూడా ఇందులో ఉన్నాయి.

తిమోతి మరియు తీతు ఎదుర్కొనిన అబద్ధ బోధపై ఈ జ్ఞానతత్వ వాదం చూపిన ప్రభావమును మనము ఎక్కువగా ఉద్ఘాటించి చూపకుండునట్లు జాగ్రత్త పడాలి. ప్రత్యకముగా జ్ఞానతత్వ వాదం అనే వాదనను బలంగా త్రిప్పికొట్టడానికి రెండవ శతాబ్దములో 1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికలు (ఈ ప్రతులకు మరింత ఊతనివ్వడానికి పౌలు యొక్క పేరు చేర్చబడి) వ్రాయబడినవి అని కొందరు అంటున్నారు. ఉదాహరణకు, దేవుడు ఒక జీవిని సృష్టించడం (దీనిని ఆయన నుండి వచ్చిన ప్రసరణము, ఒక యుగము, లేదా ఒక దూత), ఈ జీవి మరొక జీవిని సృష్టించడం, అది మరొక జీవిని సృష్టించడం, అలా అలా మొత్తం సృష్టించబడినది అని జ్ఞానతత్వవాదులు ఒక అర్థరహితమైన ధారావాహికను సృష్టించారు. అట్టి అపరితమైన కొన్ని జీవులు సృష్టింపబడిన తరువాత, వాటిలో ఒక ప్రసరణ/యుగము/దూతలలో ఒకటి పరిశుద్ధుడైన దేవుని నుండి ఈ చెడ్డదైన భూమిని (పదార్థమును) సృష్టించునంత దూరముగా తొలగిపోయింది అని జ్ఞానతత్వవాదులు అన్నారు. ఈ క్రమములోని అనేక జీవులు పేరులు ఇవ్వబడి ఆరాధింపబడ్డాయి కూడా (చూడండి కొలస్సీ. 2:18). తిమోతి మరియు తీతుకు పంపబడిన ఈ పత్రికలకు గ్రంథకర్తృత్వమును నిరాకరించు వారు కూడా “వంశావళులు” అని రచయిత ప్రస్తావించినప్పుడు ఈ జీవుల క్రమాన్నే మనసులో ఉంచుకొని వ్రాసి ఉంటాడు అని సూచిస్తున్నారు.

అపొస్తలుడైన పౌలే ఈ పత్రికలకు రచయిత అని బలమైన అంతర్గత మరియు బాహ్య ఆధారము తెలుపుతున్నాయి. ఇంకా చూస్తే, తీతుకు ఆయన వ్రాసిన పత్రికలో, “కట్టుకథలు” మరియు “వంశావళుల”ను “యూదా”వారి బోధతో మరియు “ధర్మశాస్త్రము”తో ఖచ్చితముగా కలిపే చూసాడు (తీతుకు 1:14; 3:9). (“వంశావళులు” అనే మాట ఈ విధమైన ప్రసరణల పరంపరకు జ్ఞానతత్వవాదుల రచనలలో ఎప్పుడు వాడబడలేదు.) 1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికలలో దండించబడిన అబద్ధ బోధకులు జ్ఞానతత్వవాదులు కారు; కాని, వారు యూదా నైసర్గము గల “క్రైస్తవులు” అని, వీరు కొన్ని జ్ఞానతత్వవాదుల భావనలను అక్కడక్కడ నుండి వారివారి ఆకర్షణీయమైన బోధలనుండి కొన్ని భావాలను వీరు

తెచ్చుకున్నారు కూడా.

1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికలలోని అనేక వాక్యభాగాలకు నేపథ్యాన్ని అవగాహన చేసుకొనుటకు కొంతమేర జ్ఞానతత్వవాదుల ఆలోచన అవలోకనము సహాయపడుతుంది, కాని పౌలుచే దండించబడిన అబద్ధ బోధతో ఆ బోధను అపార్థము చేసుకొనకపోయినంత వరకు.

## 1, 2 తిమోతి మరియు తీతుకు వ్రాసిన పత్రికలలోని గ్రీకు పదములు

ఈ వ్యాఖ్యానములోని అనేక గమనికలు ఒక గ్రీకు పదము వేరొక వాక్యభాగములో కూడా కనుగొనవచ్చునని చెప్తుంటుంది. ఈ గమనికల ఉద్దేశము ఏమంటే, ఆ గ్రీకు పదముపై అదనపు సమాచారము మీకు కావాలి అంటే, ఇతర వాక్యభాగముపైని వ్యాఖ్యలలో దానిని కనుగొనవచ్చు.

---

సూచనలు

[1]Bruce B. Barton, David R. Veerman, and Neil Wilson, *1 Timothy, 2 Timothy, Titus*, Life Application Bible Commentary (Wheaton, Ill.: Tyndale House Publishers, 1993), 16. [2]ఒక ఆదిమ రచయిత, మార్షియాన్ అనే అబద్ధబోధకుడు, ఈ మూడు పత్రికలను కూడా తృణీకరించాడు. మార్షియాన్ "ఖచ్చితమైన మార్మికతత్వమును ప్రకటించి [మరియు] వివాహము యొక్క చట్టబద్ధతను విస్మరించాడు ... అతని లేదా అతనివంటి వేరొక దుర్బోధను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఖండించునట్టి రచనను ఏ ఒక్క అబద్ధ బోధకుడూ ఇష్టపడడు" అని William Hendriksen గమనించాడు. (William Hendriksen, *Exposition of The Pastoral Epistles*, New Testament Commentary [Grand Rapids, Mich.: Baker Book House, 1965], 4.) చూడండి 1 తిమోతి 4:3, 4. [3]J. W. Roberts, *Letters to Timothy*, The Living Word (Austin, Tex.: R. B. Sweet Co., 1964), 5. [4]Luke Timothy Johnson, *1 Timothy, 2 Timothy, Titus*, Knox Preaching Guides (Atlanta: John Knox Press, 1987), 1. [5]Ibid., 3–4. [6]అట్టి మూలములలో ఒకటి ఈ Hendriksen, 4–33. [7]William Barclay, *The Letters to Timothy, Titus, and Philemon*, rev. ed., The Daily Study Bible (Philadelphia: Westminster Press, 1975), 8. [8]ఎక్కువ దృష్టి తీతుకు 2 మీదనే ఉంచబడింది. పౌలు యొక్క గ్రంథకర్తృత్వాన్ని ఎదిరించే వాదనలపై సుదీర్ఘ చర్చ నిమిత్తము, చూడండి Hendriksen, 377–81. [9]Roberts, 5. [10]ఫిలేమోను 9లో పౌలు తననుతాను ఇలాగే వివరించుకున్నాడు. 1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికలు వ్రాయబడుటకు ముందే ఫిలేమోనుకు పత్రిక వ్రాయబడింది.

[11]వేరొక (శాస్త్రి, కార్యదర్శి) కూడా ఉండే ఉంటాడు అని కొందరు సూచించడం జరిగింది, ఆలోచనలు వ్యక్తపరచే విధానమును ఇది కొంతమేర ప్రభావితము చేసింది. తన పత్రికలను ఒక శాస్త్రికి చెప్పడం మరియు ఆ తరువాత తన స్వహస్తముతో ఆ పత్రికలకు అధీకృతమునివ్వడానికి ముగింపు మాటలు వ్రాయడం అనేది పౌలు యొక్క వాడుకగా ఉన్నట్లు స్పష్టమౌతుంది (చూడండి 2 థెస్స. 3:17). తన ఇతర పత్రికలను వ్రాసినప్పుడు ఉపయోగించిన శాస్త్రికంటే వేరొక శాస్త్రిని ఈ సందర్భములో ఉపయోగించి ఉంటాడు. తన సొంత చేతితో కూడా ఈ పత్రికలను వ్రాసి ఉంటాడు. (ఈ పైన పేర్కొనవాటిలో ఏమి జరిగినప్పటికీ, ఫలితంగా వ్రాయబడిన వాక్యము మాత్రము మచ్చుకు దేవుడు ఎలా అనుకున్నాడో అలాగే వచ్చింది అని అర్థం చేసుకొనబడాలి.) [12]Robert Lane Greene, "Vocabulary Size: Lexical Facts," *The Economist*

(http://www.economist.com/blogs/johnson/2013/05/vocabularysize; Internet, accessed 21 October, 2016). [13]Hendriksen, 8. [14]Barclay, 9. [15]పౌలు రోమాకు ఓడలో ప్రయాణం చేయుటకు మునుపే రెండవ కొరింథీయులకు పత్రిక వ్రాయబడింది (కాబట్టి అపొస్తలుల కార్యములు 27:39-44లో చెప్పబడిన రోమా ప్రయాణ సమయములో చోటుచేసుకొనిన ఓడ బద్దలు అయిన సందర్భమునకు ముందే). [16]Eusebius *Ecclesiastical History* 2.22.1–2. [17]J. N. D. Kelly, *The Pastoral Epistles*, Harper's New Testament Commentaries (San Francisco: Harper & Row, 1960), 10. [18]John R. W. Stott, *Guard the Truth: The Message of 1 Timothy & Titus*, The Bible Speaks Today (Downers Grove, Ill.: InterVarsity Press, 1996), 33–34. [19]Ibid., 33. [20]తన మొదటి రోమా "దిగ్బంధం"లో పౌలు నిజముగా గృహ నిర్బంధంలో ఉంది ఒక సైనికుని కావలిలో ఉన్నాడు (అపొ. 28:16, 20, 30).

[21]David L. Roper, *Acts 1—14,* Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2001), 12–13. [22]Eusebius *Ecclesiastical History* 2.25. [23]ఈ సమయములో పౌలు యొక్క వయసును గూర్చి చేయబడిన ఊహాగానాలలో అధికశాతము 60వ దశామాంకం లేదా 70వ దశామాంకమునకే ఎక్కువ మొగ్గు చూపబడింది. ఆ దినములో మరియు సమయములో ఇది వృద్ధ వయసే అయి ఉండవచ్చు. [24]Donald Guthrie, *The Pastoral Epistles*, rev. ed., The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1990), 17. [25]NASB అనువాదములో, "పాస్టర్" (సేవకుడు) అనే పదమును కేవలము ఎఫెసీయులకు 4:11లో మాత్రమే కనబడుతుంది. క్రొత్తనిబంధనలో వేరే చోట్లలో, ఈ స్థలములో ఉండే గ్రీకు పదము (ποιμήν, *poimēn*)ను "కాపరి"గా అనువదించబడింది. 1 మరియు 2 తిమోతి మరియు తీతుకు పత్రికలలో ఇది అసలు ప్రయోగించబడనే లేదు. [26]క్రొత్తనిబంధనలో "ఒకరినొకడు" అని చెప్పే వాక్యభాగాలు దీనికి సరిపోయిన ఆధారముగా ఉన్నాయి (ఉదాహరణకు, చూడండి రోమా. 12:10; 14:19; 15:14; 1 కొరింథీ. 12:25; 1 థెస్స. 5:11, 15; హెబ్రీ. 3:13; 10:24). [27]Gary W. Demarest, *1, 2 Thessalonians, 1, 2 Timothy, Titus*, The Communicator's Commentary, vol. 9 (Waco, Tex.: Word Books, 1984), 147. [28]ఓక్లహోమాలోని మిడ్ వెస్ట్ సిటీలో ఉన్న ఈస్ట్ సైడ్ చర్చి ఆఫ్ క్రైస్ట్ అనే సంఘములో Dale Hartman ఇదే పోలికను తరచూ తన బోధలో ప్రయోగించాడు. [29]Barton, Veerman, and Wilson, 17. [30]NASB అనువాదములో, "హిత సిద్ధాంతము"గా అనువదించబడిన గ్రీకు మాట 1 తిమోతి 1:10లో "హితబోధ"గా కూడా అనువదింపబడింది. ఇంకా చూస్తే, తీతుకు 1:13లో పౌలు "విశ్వాస విషయమున స్వస్థులు" అనే మాటను ప్రస్తావించాడు, దీనికి అర్థము కూడా బోధలో హితముగా ఉండుట అని వస్తుంది.

[31]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 3rd ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 1023. [32]Joseph Bryant Rotherham, *The Emphasised Bible: A New Translation*, vol. 4, *Matthew–Revelation* (Cincinnati: Standard Publishing Co., 1897), 219. [33]Bauer, 678–79. [34]Guthrie, 67. [35]Bauer, 186. [36]W. E. Vine, Merrill F. Unger, William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 261. [37]క్రేతులోని అబద్ధ బోధ అనునది ఎఫెసులోని అబద్ధ బోధ వంటిదే కాకపోయినా దానిని పోలినదిగా ఉన్నదని సాధారణంగా భావించబడుతుంది. క్రేతు అనే ద్వీపము ఎఫెసునకు నైరుతి దిశలో ఉంది. [38]క్రైస్తవులుగా మారిన యూదులు వీరు కాని వీరు పాత నిబంధన ధర్మశాస్త్రమును అన్యజనులైన క్రైస్తవులపై విధిగా ఉంచాలని చూచారు. అపొస్తలుల కార్యములు 15:5 ప్రకారము, కొందరు (బహుశ అందరు కూడా) పరిసయ్యులే. [39]ఈ వంశావళులు జ్ఞానతత్త్వవాదుల సిద్ధాంతములకు చెందినవిగా కొందరు విశ్వసిస్తున్నారు, కానీ ఈ

వంశావళులు యూదా మతముకు చెందినవి అని ఇక్కడి నేపథ్యము సూచిస్తుంది. (*అదనపు అధ్యయనం కొరకు: జ్ఞానతత్వవాదం యొక్క ఆరంభ రూపము*, పేజీలు 22-24 వరకు చూడండి.) [40]అదే అవసరతను క్రైస్తవ్యంలో ఈ వంశావళులు నెరవేర్చవు. ఒక క్రైస్తవుని గొప్ప గొప్ప ముత్తాత ఎవరా అని ప్రభువు పట్టించుకోడు. క్రొత్తనిబంధనలో ఉన్న వంశావళులల్లా యేసువి, వాగ్దానము చేయబడిన మెస్సీయా ఈయనే అని అవి స్థాపిస్తున్నాయి.

[41]Hendriksen, 59. [42]"అపోక్రిఫల్" (కట్టుకథ పుక్కిటి పురాణములు) పుస్తకములు అనేవి యూదులు ప్రేరేపితమైనవిగా భావించని అప్రామాణికమైన రచనలు. మరింత ప్రత్యేకముగా చెప్పాలన్నే, జూబిలీస్ అనే పుస్తకమును "సూడెపిగ్రఫా" (మిథ్యా పుస్తకములు) విభాగములో చేర్చారు. వీటిలో కొన్నిటిని పాతనిబంధనలో ప్రసిద్ధ వ్యక్తులైన వారికి ఆపాదించబడ్డాయి, మరి కొన్ని అయితే అట్టి వారికి గౌరవార్థముగా వ్రాయబడినవి. [43]Hendriksen, 59. [44]εἰς (*eis*) అనే గ్రీకు విభక్తి అర్థము "లోనికి" అని. [45]ἐξ (*ex*), లేదా ἐκ (*ek*) అనే గ్రీకు విభక్తికి అర్థము "లో నుండి" అని. [46]లేఖనముల యోగ్యతను గూర్చిన ప్రశ్నను 2 తిమోతి 3:16, 17లో పౌలు చర్చించాడు. [47]"దేవుడు పక్షపాతి కాడు" (అపొ. 10:34). [48]Donald W. Burdick, Notes on 1, 2, 3 John, *The NIV Study Bible*, ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 1906. [49]2:15; 4:3 పై ఉద్ఘాటన జోడించబడింది. [50]2 తిమోతి 2:18 పై ఉద్ఘాటన జోడించబడింది.

[51]Bruce M. Metzger, "St. Paul and the Magicians," *Princeton Seminary Bulletin* 38, no. 1 (June 1944): 27.